ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY అన్నమయ్య జిల్లా వార్తలు
5
శుక్రవారం 5 జూలై 2024


హసనాపురం గ్రామంలో పెన్షనర్లను విచారిస్తున్న జేసీ

అర్హులైన వారికి న్యాయం చేయండి

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రామాపురం, జూలై 4: పింఛన్లలో అర్హులైన వారికి న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలోని హసనాపురం గ్రామంలో గురువారం హసనాపురం, వడ్డెపల్లె, కుమ్మరపల్లి, చీకటివాండ్లపల్లె గ్రామాల్లో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులపై ఆయన విచారణ చేపట్టారు. పింఛన్లలో తమ గ్రామంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆ గ్రామానికి చెందిన కొందరు నాయకులు ఇటీవల రామాపురం ఎంపీడీవో ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయాన్ని ఎంపీడీవో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీల దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు గురువారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆయా గ్రామాల్లో పర్యటించి పింఛన్ లబ్ధిదారులను విచారించారు. పింఛన్ల అక్రమాలపై తమకు వచ్చిన ఫిర్యాదుపై గ్రామస్థులను, లబ్ధిదారులను ఆయన విచారించారు. యర్రంగింవాండ్లపల్లెలో ఒకే కుటుంబంలో ఏడు పింఛన్లు వస్తున్నాయని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జునను గ్రామంలోకి వెళ్లి విచారించి నివేదిక పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఇన్‌చార్జ్ వీఆర్‌వో ఫాతిమా, ఎంపీడీవో కార్యాలయ ఏవో రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు

- ముఠా సభ్యులకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగించిన స్థానికులు


చెర్లోపల్లె సమీపంలోని అక్కదేవతల గుడి వద్ద చేసిన క్షుద్రపూజలు

గుర్రంకొండ, జూలై 4: గుప్తనిధుల ముఠా సభ్యులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన గుర్రంకొండలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు... గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఓ ఆలయంలో కొద్ది రోజులుగా కేరళ రాష్ట్రానికి చెందిన పూజారులు ఆయుర్వేద వైద్యం చేస్తున్నట్లు ప్రజలను నమ్మించారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు హిందూ-ముస్లిం పెద్ద మనుషులను ఈ ముఠా సభ్యులు ఆశ్రయించారు. వారి అండదండలతో అక్కడే తిష్ట వేసి పగటి పూట ఆయుర్వేద వైద్యం చేస్తున్నట్లు ప్రజలను నమ్మబలికించారు. ఈ ముఠాలో కొందరు సభ్యులు మండలంలోని ఎల్లుట్ల, చెర్లోపల్లె, సంగసముద్రం గ్రామాల్లోని పురాతన ఆలయాలు పగటి పూట రెక్కీ చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ క్రమంలో వారం రోజుల కిందట చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం సమీపంలోని అక్కదేవతల గుడి వద్ద గుప్తనిధుల కోసం పూజలు చేశారు. ఈ పూజల్లో భాగంగా జంతు బలి చేసినట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. విషయం గ్రామస్థులకు తెలియడంతో గుట్టుచప్పుడు కాకుండా అక్కడ నుంచి ఉడాయించారు. ఈ ముఠా సభ్యులకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో పరిచయాలున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే సంగసముద్రం గ్రామానికి సమీపంలోని మహేంద్రమరి వద్ద ఉన్న పురాతన ఈద్గా వద్ద కూడా గుప్త నిధుల కోసం యత్నించినట్లు ప్రజలు తెలుపుతున్నారు. ఈ ముఠా సభ్యులు పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా తిరుగుతుండడంతో ప్రజలకు అనుమానం వచ్చి ఆలయం వద్దకు వెళ్లి ఆరా తీశారు. అక్కడ ముఠా సభ్యుల ప్రవర్తన వింతగా ఉండడంతో వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ముఠా సభ్యులను విచారణ నిమితం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

రెచ్చిపోతున్న ముఠా సభ్యులు

గుర్రంకొండ మండలంలో కొన్నేళ్లుగా గుప్తనిధుల ముఠా సభ్యులు విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని కోట, మగ్గీరాలలోని డూమ్, చెర్లోపల్లె, ఎల్లుట్ల, సంగసముద్రం, శెట్టివారిపల్లె గ్రామాల్లో పురాతన కట్టడాలను గుప్తనిధుల పేరిట ధ్వంసం చేశారు. అలాగే పలు ఆలయాల్లో కూడా విగ్రహాలను పెకిలించేశారు. అంతేకాకుండా కొందరు ఈ ముఠా సభ్యుల చేత క్షుద్రపూజలను కూడా చేయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుప్తనిధుల ముఠా సభ్యులు

మా ఇష్టం..!

- ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇష్టారాజ్యం
- 80 ఏళ్ల నాటి చెట్లు నరికివేత
- రోడ్డుకు దూరంగా ఉన్న చెట్లూ నేలమట్టం
- పూర్తి కావస్తున్న పనులు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా అనుమతులు
- పచ్చదనం కోల్పోయిన ప్రధాన రహదారి


ములకలచెరువు జిల్లా సరిహద్దు సమీపంలో ఉన్న 80 ఏళ్ల నాటి చెట్లు (ఫైల్)


చెట్లు కొట్టేయడంతో పచ్చదనం కోల్పోయిన రహదారి

ములకలచెరువు, జూలై 4: ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను పలుచోట్ల అనవసరంగా నరికేశారన్న విమర్శలు వస్తున్నాయి. బ్రిటీషు వారు రోడ్డుకు ఇరువైపులా నాటించిన 80 ఏళ్ల నాటి చెట్లను పనులకు ఇబ్బంది లేకపోయినా కొట్టేశారని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం పనులు ముగింపు దశకు చేరుకోవడంతో పలుచోట్ల అక్రమంగా నరికేసిన చెట్ల మొదళ్లు కన్పిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడంతో పచ్చదనానికి తూట్లు పొడిచారు. శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దులోని ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కిలోమీటర్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబరులో రూ.480.10 కోట్లు విడుదల చేసింది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో 2022 డిసెంబరు 17న పనులు ప్రారంభించారు. జిల్లా సరిహద్దు నుంచి పనులు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లా సరిహద్దు నుంచి ములకలచెరువు, పెద్దపాళ్యం, వేపూరికోట, సెంట్రల్ స్కూల్, బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్ట, బయప్పగారిపల్లె, కోటావూరు, కురబలకోట మండలం అంగళ్లు మీదుగా మదనపల్లె వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ రహదారి పొడవునా బ్రిటీషు వారు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అవి పెరిగి భారీ వృక్షాలు అయ్యాయి. ఈ చెట్లు 60 నుంచి 80 ఏళ్ల నాటివిగా ఉన్నాయి. ఈ క్రమంలో రోడ్డుకిరువైపులా ఉన్న భారీ వృక్షాలు జాతీయ రహదారి విస్తరణ పనులకు అడ్డుగా ఉండడంతో అటవీశాఖ నుంచి అనుమతులు పొంది తొలగించారు. జిల్లా సరిహద్దు నుంచి మదనపల్లె వరకు 1211 చింత, నీలగిరి, వేప తదితర చెట్లను నేలమట్టం చేశారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు వీటిని యంత్రాల సహాయంతో శరవేగంగా తొలగించారు. దీంతో రోడ్డుకిరువైపులా భారీ చెట్లతో పరుచుకున్న పచ్చదనం కనుమరుగైంది. చెట్ల తొలగింపుతో రోడ్డంతా కళావిహీనమైంది. 2022 డిసెంబరులో ప్రారంభమైన జాతీయ రహదారి పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డుకిరువైపులా ఉన్న భారీ వృక్షాలు పలుచోట్ల అనవసరంగా కొట్టేశారన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ములకలచెరువు షాదీమహల్ సమీపం నుంచి బస్టాండు సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, పెట్రోల్ బంకు, రైల్వేగేటు వరకు గతంలో ఉన్న రోడ్డును విస్తరణతో పాటు సర్వీస్ రోడ్డును వేశారు. అయితే జిల్లా సరిహద్దు నుంచి షాదీమహల్ వరకు ఉన్న రోడ్డును కేవలం ఇరువైపులా 5 మీటర్ల చొప్పున మొత్తం పది మీటర్లు రోడ్డు వెడల్పు చేశారు. అయితే జిల్లా సరిహద్దు నుంచి షాదీమహల్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న భారీ చెట్లను అనవసరంగా కొట్టేశారన్న విషయం అర్థమవుతోంది. జిల్లా సరిహద్దు నుంచి షాదీమహల్ వరకు సుమారు 80 భారీ చెట్లు ఉండేవి. ఈ మార్గంలో చెట్లు అనవసరంగా కొట్టేయడంతో ప్రస్తుతం రోడ్డు పనులు జరిగిన 5 నుంచి 10 మీటర్ల దూరంలో ఉన్న మొదళ్లు అక్కడక్కడా కన్పిస్తున్నాయి. అలాగే వేపూరికోట సమీపంలో కూడా అనవసరంగా కొట్టేసిన చెట్ల మొదళ్లు ఉన్నాయి. పనులకు అడ్డుగా ఉంటే రోడ్డువైపు వాలిన చెట్ల కొమ్మలు తొలగించి ఉంటే సరిపోయేది. వైసీపీ నేతల ఒత్తిడితో అధికారులు ముందుచూపు లేక ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడంతో ఏళ్ల నాటి చెట్లు అనవసరంగా కొట్టేశారని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు నరికేయడంతో ఈ మార్గంలో పచ్చదనం కోల్పోవడంతో పాటు పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లిందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.


ములకలచెరువులో చెట్లు కొడుతున్న తమిళనాడు కూలీలు (ఫైల్)

నాడు కళకళ.. నేడు వెలవెల

ములకలచెరువు సమీపంలోని కదిరి రోడ్డులో జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేకపోయినా భారీ చెట్లు తొలగించడంతో కళ తప్పింది. జిల్లా సరిహద్దు నుంచి షాదీమహల్ వరకు చెట్లు తొలగించడంతో ఈ మార్గంలో పచ్చదనం మాయమైంది. అలాగే రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. చెట్లు తొలగించడంతో ఈ ప్రభావం ములకలచెరువు వాసులపై అత్యధికంగా పడింది. రెండేళ్ల పాటు వేసవిలో ఎండ తీవ్రత అధికమైంది. ఏళ్ల నాటి చెట్లతో ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం కలిగేవి. చెట్లు నరికేయడంతో ఈ ఏడాది వేసవిలో చుక్కలు కన్పించాయి.

నిబంధనల ప్రకారమే అనుమతులు ఇచ్చాం..

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడానికి నిబంధనల ప్రకారమే అనుమతులు ఇచ్చాం. రోడ్డు మార్కింగ్ ఇచ్చి అటవీ శాఖ అనుమతులు తీసుకుని చెట్లను తొలగించాము. ఎత్తును బట్టి విస్తరణ చేసినా అదనంగా ఇరువైపులా ఎనిమిది నుంచి పదిమీటర్ల వరకు పనులకు స్థలం అవసరం ఉంటుంది. అందువల్లే అక్కడ ఉన్న చెట్లను తొలగించాము. అనవసరంగా చెట్లను ఎక్కడా తొలగించలేదు.

- మధుసూదన్, ఎన్‌హెచ్ ఏఈ, మదనపల్లె


ములకలచెరువు షాదీమహల్ సమీపంలో రోడ్డు పనులకు దూరంగా ఉన్న చెట్టు కొట్టేయడంతో మిగిలిన మొదలు


వేపూరికోట సమీపంలో రోడ్డుకు 10 అడుగులు దూరంలో ఉన్న నీలగిరి చెట్టును కొట్టేసిన దృశ్యం

హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా దివ్యతేజ



రాజంపేట, జూలై 4: హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా రాజంపేటకు చెందిన న్యాయవాది గడికోట దివ్యతేజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది గడికోట రామచంద్ర కుమారుడైన దివ్యతేజ రాజంపేట కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ మంచి గుర్తింపు పొందారు. ఈయనను ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడరుగా నియమించడం పట్ల రాజంపేటకు చెందిన పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

షోకాజ్ ఇచ్చుకో.. పైసల్ పుచ్చుకో..



- ప్రతి పనికీ ఓ రేటు..
- ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా.. ఇక్కడే వసూళ్లు..
- ఇదీ డీపీవో కార్యాలయం తీరు

రాయచోటి (కలెక్టరేట్) జూలై 4: రాజు తలచుకుంటే కొరడా దెబ్బలు కరువా అన్న సామెత ఈ కార్యాలయానికి వెళితే ఇట్టే గుర్తుకు వస్తుంది. జిల్లాలో పంచాయతీ సెక్రటరీలు ఏ చిన్నతప్పు చేసినా వారిని మందలిస్తే సరిపోయే పనికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు దాదాపు 10 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వారి దగ్గర నుంచి వేలల్లో వసూలు చేసినట్లు అ శాఖలోని ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తయినా జిల్లాలోని కొన్ని కార్యాలయాల్లో మామూళ్లు మాత్రం ఆగడం లేదు. జిల్లాలో మొత్తం పంచాయతీ సెక్రటరీలు 959 మంది, ఈవోపీఆర్‌డీలు 28 మంది పనిచేస్తున్నారు. ఇందులో 5 నుంచి 10 సంవత్సరాలు ఒకే స్థానంలో పనిచేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. వీరందరినీ 2023 జూన్‌లో బదిలీ చేస్తానని చెప్పిన డీపీవో ఇప్పటి వరకు ఒక్కరిని కూడా బదిలీ చేయకపోవడంపై పలు రకాల విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో మదనపల్లి డివిజన్‌లో చాలా మందికి గ్రేడ్-4 సెక్రటరీలకు పని తెలియకపోయినా వారిని గ్రేడ్-1 పంచాయతీలో ఉంచడంపై పలు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఏ చిన్న తప్పు చేసినా పంచాయతీ సెక్రటరీలను తక్షణం రాయచోటి కార్యాలయానికి పిలిపించుకుని వారికి షోకాజ్ నోటీస్ ఇచ్చి మరీ పైసలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

డీపీవో కార్యాలయానికి ఏదైనా సమస్యపై వచ్చిన వారికి అ పనిని బట్టి రేటు ఫిక్స్ చేసి వసూళ్లు చేస్తున్నారని అక్కడ పనిచేస్తున్న సిబ్బందే చెబుతున్నారు. ఈ వ్యవహారం అంతా నడిపించేందుకు తన కార్యాలయంలోనే ఓ ఉద్యోగిని తయారు చేసుకున్నారని, అతనికి ఈవోపీఆర్‌డీగా ప్రమోషన్ వచ్చినా పంపకుండా ఈ కార్యాలయంలోనే కలెక్షన్ కింగ్‌గా మార్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబేపల్లి, చిన్నమండెం, సుండుపల్లి, మదనపల్లిలోని కొన్ని పంచాయతీల్లో సెక్రటరీలు ఏళ్ల తరబడి తిష్ట వేసి వసూళ్లరాజాల్లా ఉద్యోగం చేస్తున్నారని వీరందరినీ ఆ అధికారి కంటికి రెప్పలా కాపాడుకుంటోందన్న అభియోగాలు వస్తున్నాయి. జిల్లాలో డీఎల్‌పీవోలు నామమాత్రంగా ఉన్నారే కాని వారికి ముఖ్యమైన పనులు అప్పచెప్పడం లేదనే వాదన బలంగా వినపడుతోంది. జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా అ మండల ఈవోఆర్‌డీకి సంబంధం లేకుండా పంచాయతీ సెక్రటరీలతో నేరుగా మాట్లాడి పనులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సంబేపల్లిలోని దాదాపు 50 గ్రామాల వారు 3 నెలలుగా తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నా డీపీవో కార్యలయ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడలేదనే విమర్శలు మండలంలో బలంగా ఉన్నాయి.

సిబ్బంది తీరు బాగో లేదు..

డీపీవో పనితీరుపై తీరుపై మొదటి నుంచి విమర్శలు వినపడుతున్నాయి. అ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి వచ్చినా అయనను సంబేపల్లెకు పంపకుండా తన కార్యాలయంలోనే పెట్టుకుని వసూళ్లు చేస్తున్నారు. ఆమె జిల్లా అధికారా లేక ఒక్క మదనపల్లి డివిజన్‌కు మాత్రమే అధికారా అన్న విషయం డీపీవోనే చెప్పాలి. ఇకనైనా షోకాజ్ నోటీసులకు స్వస్తి చెప్పి మామూళ్లను పక్కన పెట్టి పరిపాలనపై దృష్టి పెట్టాలని కోరుకోంటున్నాం.

- సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

డబ్బులు తీసుకుంటున్న విషయం నా దృష్టికి రాలేదు..

షోకాజ్ నోటీసులకు మా కార్యాలయంలో డబ్బులు తీసుకుంటున్న విషయం నా దృష్టికి రాలేదు. సీనియర్ అసిస్టెంట్‌కు (ఈవోపీఅర్‌డీ)గా ప్రమోషన్ వచ్చిన మాట వాస్తవమే. మా కార్యాలయంలో స్టాఫ్ తక్కువగా ఉన్నపుడు అతడిని ఇక్కడే ఉంచాను. ఇప్పుడు సిబ్బంది ఉన్నారు కాబట్టి అయనను త్వరలో సంబేపల్లికి రిలీవ్ చేస్తాను. నేను కొన్ని గ్రామాలకు వెళ్లలేదని ఎవరు చెప్పారు. అన్ని గ్రామాలు తిరుగుతున్నాను.

- ధనలక్ష్మి, డీపీవో

ఆర్టీవో కార్యాలయంలో కోడ్ భాషపై డీటీవో విచారణ


ఆర్టీవో కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతున్న డీటీవో భరత్‌చవాన్

మదనపల్లె, జూలై 4: మదనపల్లె ఆర్టీవో కార్యాలయంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి (డీటీవో) భరత్‌చవాన్ విచారణ చేపట్టారు. 'ఆర్టీవో కార్యాలయంలో కోడ్‌భాషతో అక్రమాలు' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన తిరుపతి ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ బసిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా డీటీవో భరత్‌చవాన్ గురువారం ఇక్కడి కార్యాలయానికి చేరుకున్నారు. ఎల్‌ఎల్‌ఆర్, డీఎల్, ఎఫ్‌సీ, తదితర రికార్డులు పరిశీలించారు. అప్పటికే టెస్టింగ్‌కు వచ్చిన వాహనాలు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్య, శ్రీహరిలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో సేవల వికేంద్రీకరణలో భాగంగా మనం కేవలం మూడు సేవలే చేస్తున్నా ఇప్పటికీ వినియోగదారుల నుంచి ఆరోపణలు, విమర్శలు, పత్రికల్లో కథనాలు రావడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి జిల్లా కావడంతో ఇలాంటి ఆరోపణలు, వినియోగదారుల నుంచి విమర్శలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి హితబోధ చేశారు. మరోసారి ఇలాంటి సమస్య పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవనే సాంకేతాలు ఇచ్చారు. గతంలో ఇలాంటి ఆరోపణలు, ఫిర్యాదులపై తాను హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో ఓ ఇన్‌స్పెక్టర్‌ను తీవ్రంగా మందలించారు. వినేదానికి తన వాయిస్ అలా ఉంటుందని, ఎవరినీ కించపరిచి మాట్లాడలేదనే సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించిన ఇన్‌స్పెక్టర్‌కు డీటీవో పలు సూచనలు చేశారు. మన మాటతీరు మనకు అలాగే అనిపించినా..ఎదుటి వారికి అలా అనిపించదని, ఇక్కడికి వచ్చే వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ సేవలన్నీ ఆన్‌లైన్ కావడంతో ప్రజలు ఎవరూ కార్యాలయానికి రావడం లేదన్నారు. వారంతా ఆన్‌లైన్‌లో అప్లయ్ చేస్తున్నారు..మేం ఇక్కడ ఆమోదిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఎవరూ ఏజెంట్లు, మధ్యవర్తులను కాకుండా డైరెక్ట్‌గా కార్యాలయానికి వచ్చి సేవలు పొందవచ్చని సూచించారు. మదనపల్లె చిన్న కేంద్రం ఇక్కడికి వచ్చే దరఖాస్తులు తక్కువేనన్నారు. దానికి తోడు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు ఉండటంతో ఎన్‌ఫోర్సుమెంట్ బాగా జరుగుతోందన్నారు. ప్రత్యేకంగా ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించిన డీటీవో..ఇక్కడ వసూళ్లు ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి సేవకూ ఆరోజే ఫలితం వచ్చేస్తుందని, దేనినీ తిరస్కరించే అవకాశం లేదని భరత్‌చవాన్ వివరించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం


మోడల్ స్కూల్ విద్యార్థులను ఇళ్లకు పంపుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 4: నీట్ పరీక్షల్లో అక్రమాలకు అవకాశం ఇచ్చిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయడంతో పాటు నీట్ పరీక్షను కూడా రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు నరేశ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌లో భాగంగా జిల్లాలో విద్యాసంస్థల బంద్‌ను విజయవంతంగా చేపట్టారు. జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ముందుగానే పాఠశాలలకు సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థి సంఘాల నేతలు వెళ్లి విద్యార్థులకు తరగతుల నుంచి బయటకు పంపించి పాఠశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్ర పభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. నీట్ పరీక్షకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి ఏరియా నాయకులు ప్రశాంత్, కార్తీక్, వాసుదేవనాయక్, సతీశ్‌నాయక్, ప్రవీణ్, రమణ, రాంబాబు, రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు నుంచి ఖైదీ పరారీ

రాజంపేట, జూలై 4 : రాజంపేట పట్టణంలోని సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న బాష అలియాస్ బాబు జైలు నుంచి పరారైనట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. గురువారం సాయంత్రం ఎవరూ గమనించని సమయంలో జైలులో ఇచ్చిన దుప్పట్లను తాడుగా చేసుకుని జైలు గోడ దూకి పారిపోయాడు. జైలర్ మల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజంపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పారిపోయిన ఖైదీ రైల్వేకోడూరులో రెండు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

'కాంట్రాక్ట్ మల్టీ పర్పస్'పై కరుణ చూపండి

- ఎన్నికలకు ముందు రెగ్యులర్‌కు గత ప్రభుత్వం చట్టం
- నిధి పోర్టల్ తెచ్చిన తిప్పలు..
- రోడ్డున పడిన కాంట్రాక్ట్ ఉద్యోగులు
- వీరికి రిటైర్మెంట్ వయస్సు 60 ఏళ్లేనా...



కడప(కలెక్టరేట్), జూలై 4: సుమారు 22 ఏళ్ల కిందట డీఎస్సీ ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఎంపికయ్యారు. రెగ్యులర్ విషయంలో గత ప్రభుత్వం ఎన్నికల ముందు చట్టం చేసింది. 2014కు ముందు ఉద్యోగాల్లో ఉన్న కొందరిని ఎట్టకేలకు రెగ్యులర్ చేసింది. అయితే వీరి రెగ్యులర్ విషయంలో నిధి పోర్టల్ తెచ్చి కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలను మాత్రమే అప్‌లోడ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. నిధి పోర్టల్‌లో ఆంక్షలు, మెలికల కారణంగా నోటికాడికి వచ్చిన ఉద్యోగాలు చేతికి అందక పోవడంతో ఉమ్మడి జిల్లాలో కొందరు ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది రాష్ట్రంలో కాంట్రాక్ట్ పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎంపీహెచ్ఎస్‌లు, ఏఎన్ఎం ఉద్యోగాలు, వివిధశాఖల్లో దాదాపు 10117 మందికి కేవలం 3600 మందికి మాత్రమే రెగ్యులర్ చేయడం చూస్తే ఎన్నికల స్టంట్ అనే విషయం రూఢీ అవుతోంది. జిల్లాలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొంది రెగ్యులర్ కోసం 35 మంది నిరీక్షిస్తుండడం గమనార్హం. మిగిలిన శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి దయనీయం. దీంతో ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో నెట్టు కొచ్చి, రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు కరుణ చూపాలని కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులు మొర పెట్టుకుంటున్నారు.

చట్టం ఉల్లంఘించి రెగ్యులరైజేషన్

గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించి 30 యాక్టు తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 2014కు ముందు డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిని మాత్రమే రెగ్యులర్ చేయాలి. కానీ ఇక్కడ కూడా నిబంధనలకు పాతర వేశారు. 2014కు ముందు అనే మాటకు విలువ లేకుండా ఆతరువాత 2017 వరకు సెలెక్ట్ అయిన వారిని రాజకీయ పలుకుబడితో రెగ్యులర్ విషయంలో చట్టం ఉల్లంఘించి అనుయాయుల కోసం చక్రం తిప్పడంతో ఏళ్ల తరబడి రెగ్యులర్ కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగుల కష్టాలకు కారణంగా చెబుతున్నారు. 2002 టీడీపీ చంద్రబాబు పాలనలోనే కాంట్రాక్టు ఉద్యోగాలు పొందాము. సాధారణ ఎన్నికల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని మేనిఫేస్టోలో పెట్టడం కొండంత ధైర్యం వచ్చిందన్నారు. జిల్లాలో ఎలాంటి కోర్టుల్లో, వివాదాలు లేని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసే విషయంలో ఈ ప్రభుత్వం కరుణ చూపాలంటున్నారు.

గత ప్రభుత్వం చిన్న చూపు

2002 నుంచి కాంట్రాక్ట్, ఎస్ఎంఆర్ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా ఎంపిక చేశారు. వీరి రెగ్యులర్ విషయంలో లేని పోని ఆంక్షలు, గత ప్రభుత్వ విధానాల కారణంగా తమకు అన్యాయం జరిగిందంటున్నారు. రెండేళ్ల కిందట రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గులను రెగ్యులర్ చేయగా, తమ విషయంలో గత ప్రభుత్వం ఎన్నికల కోడ్ సాకుతో నిధి పోర్టల్‌లో రెగ్యులర్ సమాచారం నమోదు చేయకుండా హోల్డ్‌లో పెట్టడంపై కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రిటైర్మెంట్ సర్వీసు 60 ఏళ్లకు కుదించడం పట్ల అసంతృప్తి వ్యక్తమౌతోంది.

పూర్వపు విధులు నిర్వీర్యం

గత ప్రభుత్వ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాల రాకతో తాము గతంలో ప్రజలకు చేరువగా చేస్తున్న విధులకు మంగళం పాడిందని హెల్త్ అసిస్టెంట్లు వాపోతున్నారు. విధుల నిర్వహణలో గత ప్రభుత్వ నిర్ణయాలు గందరగోళ పరిస్థతులు తెచ్చిపెట్టాయంటారు. గతంలో 15 రోజులకు ఒకసారి ప్రతి ఇంటిని సందర్శించి మలేరియా, కుష్ఠు, టీబీ, ఎయిడ్స్ లాంటి 14 జాతీయ ప్రోగ్రాంలలో కీలకంగా పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు 5,6 గ్రామ వార్డు సచివాలయాల బాధ్యతలను కట్టబెట్టారు. చాలీచాలనీ జీతాలతో పనిచేసే వీరిని యుద్ధప్రాతిపదికన (ఎమర్జెన్సీ సమయాల్లో) పనిచేసే విధంగా రీ డెప్లాయ్ మెంట్ పేరుతో జిల్లాలో ఇతర ప్రాంతాలకు బదిలీల చేయడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పవచ్చు. ఇక ప్రతి 5000 మంది జనాభాకు ఒక హెల్త్ అసిస్టెంట్ పని చేయాలి. రీడిప్లాయ్‌మెంట్ పేరుతో అధిక పని భారం మోపడంతో మిగిలిన హెల్త్ అసిస్టెంట్ల భర్తీలు చేపడితే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువవుతాయి.



ప్రభుత్వం కరుణించాలి

రాష్ట్రంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. గత ప్రభుత్వంలో నిధి పోర్టల్ కారణంగా చాలా మది పేర్లు అప్‌లోడ్ జరగలేదు. వెంటనే అప్‌లోడ్ చేసి మల్టీపర్పస్ ఉద్యోగులు, అన్ని శాఖల వారిని రెగ్యులర్ చేయాలి. ఎన్డీఏ కూటమి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల్లో భాగంగా తమకు ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి.

-కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనరు యర్రపురెడ్డి

వ్యక్తి ఆత్మహత్య



ఓబులేసు మృతదేహం

ముద్దనూరు జూలై 4: మండల పరిధి చిన్నదుద్యాల గ్రామ సమీపంలోని మూత పడ్డ తార మిక్సింగ్ వద్ద వాచ్‌మెన్ గండి ఓబులేసు(45)ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలిలా.. చిన్నదుద్యాల గ్రామానికి చెందిన ఓబులేసు నెల్లూరు తిరుపతిరెడ్డికి చెందిన మూతవేసిన తార మిక్సింగ్ ప్లాంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి ప్లాంట్ వద్దకు వెళ్లి పడుకొని ఉదయం ఇంటికి తిరిగివస్తాడు. బుధవారం రాత్రి ప్లాంట్ వద్దకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ప్లాంట్ వద్దకు వెళ్లి గది కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం ప్లాంట్ వద్ద ఉన్న మోటర్లు చోరీకి గురి కావడంతో.. యజమానికి తెలిస్తే ఏమంటాడోనని భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య రేణుక తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

లారీల అద్దాలు ధ్వంసం - కేసు నమోదు



మైలవరం, జూలై 4: దాల్మియా పరిశ్రమ వద్ద తొమ్మిది లారీల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టారని ట్రాన్స్ పోర్టు మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వద్ద లారెన్స్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీల అద్దాలను బుధ వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టార న్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు తెలిపారు.

లారీల అద్దాల ధ్వంసం వైసీపీ వారి పనే

దాల్మియా పరిశ్రమ వద్ద ఓ ట్రాన్స్‌పోర్ట్ లోని 9 లారీల అద్దాల ధ్వంసం వైసీపీ నేతల పనేనని టీడీపీ నేతలు కర్నాటి తిరుపాల్‌రెడ్డి, ముని, అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం సాయంత్రం చిన్నకొమెర్ల గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారం పోవడంతో ఆదాయం తగ్గుతుందన్న భయం, చేసిన అక్రమాలు బయటపడతాయన్న వణుకు వైసీపీ నేతల్లో కనిపిస్తోందన్నారు. దీంతో వైసీపీ నేతలు అక్రమాలకు, దాడులకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌పోర్టులోని లారీల అద్దాలను బుధవారం రాత్రి వారే పగులగొట్టి టీడీపీ నేతలు పగలగొట్టారని దుష్ప్రచారం చేస్తున్నార న్నారు. అద్దాలు పగులగొట్టా ల్సిన అవసరం లేదన్నారు. పోలీసులు దర్యాప్తు చేసి నిజానిజాలు బయటపెట్టాలని కోరారు.

లాడ్జిలో యువకుడు ఆత్మహత్య

కడప (క్రైం), జూలై 4 : కడన నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్ సమీపంలోని లాడ్జిలో ఓ యువకుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన చీర రంజిత్ (25) రెండురోజుల క్రితం ప్రశాంత్‌రెడ్డి అనే స్నేహితుడి అక్క పెళ్లికి వచ్చాడు. లాడ్జిలో రూము తీసుకుని ఉంటున్నాడు. గురువారం ఉదయం లాడ్జిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద సూసైడ్ లెటరు ఉందని.. అందులో అమ్మా నాన్న ఆశయాలను అందుకోలేకపోతున్నాను అంటూ రాసి ఉంది. ఆ సూసైడ్ లెటరును స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు, జూలై 4 : కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె బస్టాపు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. తోళ్లగంగనపల్లెకు చెందిన వెంకటరమణ ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి ఎర్రగుంట్ల వైపునకు బుడేరాం అనే వ్యక్తి మరో ద్విచక్ర వాహనంలో వెళుతూ ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

వైద్యం అందడంలేదని సర్వజన ఆసుపత్రిలో ఆందోళన

- విద్యార్థులను వార్డులకు తిప్పుతున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపణ
- మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సర్దిచెబుతున్న ఆర్ఎంవో

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 4: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గురువారం కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనారోగ్యం పాలైన విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వైద్యులు, వైద్యసిబ్బందితో గొడవకు దిగారు. వివరాలిలా.. కొద్దిరోజుల క్రితం ఖాజీపేట మండలం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. విద్యార్థులకు ఇక్కడ వైద్యసేవలందించి కొంత మందిని డిశ్చార్జి కూడా చేశారు. మరికొంత మందికి తీవ్రత తగ్గడంతో జనరల్ వార్డుకు తరలించారు. డిశ్చార్జి అయి వార్డుకు తరలించిన విద్యార్థులకు అస్వస్థత మళ్లీ తీవ్రం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆసుపత్రిలో తమ పిల్లలకు సరైన వైద్యం అందడంలేదంటూ ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవోలు మరియు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వైద్యులు, సిబ్బంది సర్ది చెప్పారు. విద్యార్థులకు మరింత మెరుగైన సేవలందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డాక్టర్లు, ఆర్ఎంవోలు విద్యార్థుల తల్లిదండ్రులకు సర్ది చెప్పారు. 26 మంది విద్యార్థులకు చికిత్సలందిసున్నారు. ప్రస్తుతం వార్డులో 20 పడకలు ఉంటే విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు అందరికీ ఒకేచోట చికిత్స అందించే ఉద్దేశ్యంతో అదనంగా మరో పది పడకలను ఏర్పాటు చేశారు.

పదే పదే రక్తం తీస్తున్నారు

- గీత, విద్యార్థి తల్లి



అనారోగ్యానికిగురైన పిల్లలకు పదే పదే పరీక్షల నిమిత్తం రక్తం తీస్తున్నారు. అనుభవం లేని వైద్యులు వచ్చి అనేక సార్లు సూదులతో గుచ్చి గుచ్చి రక్తం తీస్తున్నారు. నొప్పితో పిల్లలు బాధపడుతున్నారు. రక్తపరీక్షలకు రక్తనమూనాలతో వెళితే రక్తం సరిపోదు మరింత తీసుకురండి అని పదే పదే తిప్పుతున్నారు. సిబ్బంది విసుక్కుంటున్నారు. రోజులు గడుస్తున్నా పిల్లల్లో మార్పులు కనిపించడంలేదు. విద్యార్థులు ఇంకా అస్వస్థతోనే ఉన్నారు. పరీక్షల కోసం అటు ఇటూ ఎక్కువగా తిరగాల్సివస్తోంది.

పరామర్శించడానికి ఎవరూ రాలేదు

● స్వర్ణ, విద్యార్థిని తల్లి



ఇంత మంది పిల్లలు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంటే ఏ అధికారి కానీ, నాయకుడు కానీ పరామర్శించడానికి రాలేదు. పిల్లలను అస్వస్థతకు కారణమైన స్కూలు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్కూలు నుంచి ఏ అధికారి వచ్చి పిల్లలు ఎలా ఉన్నారని అడగలేదు. ఇంత మంది పిల్లలకు ఇలా ఉంటే.. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- డాక్టర్ యాదవేంద్రరెడ్డి, జనరల్ మెడిసిన్, హెచ్‌వోడి

విద్యార్థులకు కలుషిత నీటి వల్ల వైరల్ డయేరియా సోకింది. వాంతులు, అధికంగా విరేచనాలు వీటి ప్రధాన లక్షణం. విద్యార్థులకు ఓఆర్ఎస్, సెలైన్ ద్వారా మందులు అందిస్తున్నాం. తీవ్రత తగ్గిన విద్యార్థులను జనరల్‌వార్డుకు తరలించాం. అందరూ ఒకే చోట ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. వార్డు సామర్థ్యం 20పడకలు మాత్రమే. మెరుగైన వైద్యం అందించి కొంతమందిని డిశ్చార్జి కూడా చేశాం. వైద్య బృందం నిరంతరం విద్యార్థుల ఆరోగ్య స్థితి చూస్తూనే ఉన్నారు. చాల వరకు విద్యార్థులు కోలుకున్నారు.

అదనపు పడకలు ఏర్పాటు చేశాం

డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంవో, సర్వజన ఆసుపత్రి, కడప

విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది వైద్యసేవలు అందడం లేదని కాసేపు ఆందోళన చేశారు. వారి మానసిక ఆందోళన అర్థం చేసుకుని అందరూ ఒకే చోట ఉండే విధంగా మరో పది అదనపు పడకలు ఏర్పాటు చేశాం., విద్యార్థులకు నిరంతరం వైద్యులు, వైద్యసిబ్బంది పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులు త్వరగా కోలుకుంటారు. వారికి ప్రత్యేక డైట్ (ఆహారం) కూడా పంపిస్తున్నాం.

విద్యుత్ తీగలు తగలి యువకుడు మృతి



మృతి చెందిన రమణ

వీరబల్లి, జూలై 4: మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ పిచ్చికుంటపల్లికి చెందిన కత్తి రమణ (29) అనే యువకుడు అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగులుకుని షాక్‌కు గురై మృతి చెందారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు... బుధవారం గ్రామానికి చెందిన పలువురు పశువులకు మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పిచ్చికుంటపల్లికి చెందిన ముగ్గురు కలిసి వాటిని వెతకడానికి అడవికి వెళ్లారు. అక్కడ తాటిగుంటపల్లెకు చెందిన రామ్మోహన్‌రెడ్డి, మోటకట్ల బాబులు అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు తీయడంతో.. కత్తి రమణ వాటికి తగులుకుని షాక్ గురై మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు తెలపడంతో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. కత్తి రమణకు సంవత్సరం క్రిం వివాహం కాగా, ఇటీవలే కుమారుడు పుట్టాడు. చిన్న వయస్సులోనే రమణ ఆకస్మిక మృతితో భార్య, బిడ్డ అనాధలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, కత్తి రమణ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పేర్కొన్నారు.

9 మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

ఒంటిమిట్ట, జూలై 4: మండల పరిధిలోని చిన్న కొత్తపల్లెలో మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ జయరామయ్య అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వర్దన్ మధ్య ద్విచక్ర వాహనం విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. అక్కడే ఉన్న స్థానికులు ఇరువురికి సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు. అనంతరం రాత్రి సమయంలో తన బంధువులు, స్నేహితులతో కలిసి చిన్నకొత్తపల్లె గ్రామంలో ఉన్న జయరామయ్య ఇంటిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అత న్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. జయరామయ్య తన ఇంటిపైకి మారణాయుదాలతో దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు తమ్మిశెట్టి వర్దన్‌తో పాటు మరో 9 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రెడ్డిపల్లె చెరువు కట్టపై ప్రమాదం...ఇద్దరు మృతి

- మృతుల ఇద్దరు భార్యలు గర్భిణులు



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర, సుబ్బరాయుడు

ఓబులవారిపల్లె, జూలై 4: కడప - చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద లారీ - సుమోను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె అరుంధతీవాడకు చెందిన రెడ్డిపాప వెంకటేశ్వర(25), రాజంపేట మండలం ఆకేపాడు పంచాయతీ రేణింతలకు చెందిన వెలకచర్ల సుబ్బరాయుడు(25)లు ఓబులవారిపల్లె నుంచి రెడ్డిపల్లెకు వస్తుండగా రాజంపేట నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశ్వర ఓబులవారిపల్లెకు చెందిన వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం పెళ్లి కాగా.. అతని భార్య నిండు గర్భిణి, శుక్రవారం డెలివరికీ వెళ్లాల్సి ఉందని.. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసరం ఏర్పడుతుందని తాను పనిచేస్తున్న యజమాని నుంచి సుమోను తీసుకుని ఇంటివద్ద పెట్టుకోవడానికి వస్తున్న సమయంలో లారీ రూపంలో మృత్యువు వచ్చి తీసుకుపోయిందని భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అతనికి తోడుగా ఉన్న మరో వ్యక్తి సుబ్బరాయుడుకు కూడా గతయేడాది వివాహం కాగా అతని భార్య కూడా ఐదు నెలల గర్భిణి. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే పోలీసు సిబ్బందితో ఎస్ఐ చిన్నపెద్దయ్య ఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను అదుపు చేసి నుజ్జు నుజ్జు అయిన వాహనాన్ని పక్కకు తీసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.2,26,898 విలువగల సెల్‌ఫోన్‌లు స్వాధీనం

చీరాలటౌన్, జూలై 4 : రైళ్లల్లో సెల్‌ఫోన్‌లు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను చీరాల జీఆర్‌పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కొండయ్య తెలిపిన వివరాల ప్రకారం కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడుకు చెందిన ఇల్లూరు హరినాథ్‌రెడ్డి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. ఉద్యోగం లేకపోవడంతో మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసగా మారాడు. ఈక్రమంలో రైళ్లల్లో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇదిలావుండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో హరినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దొంగతనాలకు పాల్పడిన వివిధ కంపెనీలకు చెందిన 6 సెల్ ఫోన్‌లు అప్పగించాడు. వాటి విలువ సుమారు రూ.2,26,898 ఉంటుందని తెలిపారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: ఇంజనీరింగ్, అగ్రికల్చలర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించడానికి వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. విద్యార్థుల సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లను గమనించి ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ సెంటర్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు.

వైవీయూలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 4: వైవీయూ లలిత కళల విభాగంలో నాలుగు సంవత్సరాల బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి మృత్యుంజయరావు తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఏ గ్రూపులో ఉత్తీర్ణత అయినా అర్హులని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 10లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 9010014304 నెంబరుకు సంప్రదించాలన్నారు.

రామాలయంలో కౌలు కోసం టెండర్లు

ఒంటిమిట్ట, జూలై 4: ఒంటిమిట్ట కోదండరామాలయం అధీనంలో ఉన్న వ్యవసాయ భూముల కౌలు కోసం గురువారం టీటీడీ, రెవెన్యూ అధికారులు టెండర్లను నిర్వహించారు. మండలంలో రెవెన్యూ పరిధిలోని 342, 753, 896/1, 1147, 1153, 1169, 1835, 81, 86, 925/3 సర్వేనంబర్లలోని కోదండరామాలయం ఆధీనంలో ఉన్న భూములకు సంవత్సరం కౌలు కోసం టెండర్లను ఆహ్వానించారు. గురువారం ఉదయం నుంచి టీటీడీ పరిపాలన భవనంలో టెండర్లు ప్రక్రియ చేపట్టారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ తెలిపారు.

పాత విధానంలోనే పంటల బీమా

పులివెందుల టౌన్, జూన్ 4: పాత విధానంలోనే పంటలబీమా అమలు జరుగుతుందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం అమరావతిలో వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్‌ను కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు మేలు జరిగే విధంగా పంటల బీమా విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ నుంచే పాత విధానం ప్రారంభమవుతుందని, రైతులే స్వయంగా బ్యాంకులు లేదా ఆర్బీకేల ద్వారా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూలై 31లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకున్న వారు ఆదే బ్యాంకులో ప్రీమియం కట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక వేళ సమయాభావం వల్ల వీలుకాకపోతే వ్యవసాయశాఖ ద్వారా దరఖాస్తులు తీసుకుంటారని, నోటిఫైడ్ చేసిన అన్ని పంటలకు బీమా కట్టుకోవచ్చన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్సీ తెలిపారు.

70 చౌక బియ్యం బస్తాలు పట్టివేత

చెన్నూరు, జూలై 4: మండల పరిధిలోని శివాలపల్లె వద్ద 70 బస్తాల చౌక బియ్యాన్ని చెన్నూరు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. శివాలపల్లె గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా బియ్యం బస్తాలు ఉన్నట్లు తెలియడంతో రెవెన్యూ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం 202 బస్తాల బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు బియ్యం అక్రమ రవాణాపై దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందికి పక్కా సమాచారం రావడంతో పట్టుకున్నారు. కాగా, మండలంలో బియ్యం అక్రమ రవాణా ఇటీవల ఎక్కువగా జరుగుతుందన్న సమాచారం పదే పదే రావడంతో వాటిపై దృష్టి సారించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. డీలర్లు కూడా బియ్యం పక్కదారి పట్టనీయకుండా కార్డుదారులకు కచ్చితంగా పంపిణీ చేయాలని తహసీల్దారు ప్రకాశ్‌బాబు తెలిపారు. ఏ చౌకదుకాణంపై ఫిర్యాదు రాకూడదన్నారు.

కొండూరువాసి కువైత్‌లో మృతి



పెంచలయ్య (ఫైల్)

అట్లూరు, జూలై 4: మండలంలోని కొండూరు వాసి అయిన గంపా పెంచలయ్య (55) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన బంధువుల వివరాల మేరకు.. పెంచలయ్య జీవనోపాధి కోసం ఏడాది కిందట కువైట్‌కు వెళ్లాడు. బుధవారం సాయంత్రం బిల్డింగు పని చేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో పక్కనే పనిచేస్తున్న సహచరులు కువైట్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించారని కుటుంబీకులు తెలిపారు. పెంచలయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెంచలయ్య మృతదేహాన్ని శుక్రవారం సొంత ఊరైన కొండూరుకు తరలిస్తారని బంధువులు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కొండాపురం, జూలై 4: పట్టణంలోని సచివాలయం సమీపంలో ఓ ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో గురువారం ఇద్దరికి గాయాలయ్యాయి. ఇంటి వద్ద మూత్ర విసర్జన విషయంలో వెల్లాల రామలింగారెడ్డి, అతని తల్లి విజయలక్ష్మి, చంద్రఓబుళరెడ్డి ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో విజయలక్ష్మి, చంద్రఓబుళరెడ్డికి గాయాలైనట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



కావలెను
B.Ed. కాలేజీలో పనిచేయుటకు అనుభవం కలిగిన M/F కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్రదించండి : 98855 27711
Ajc-188912

WANTED
కడపనగరంలో ప్రముఖ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ నందు 3rd to 5th ఇంగ్లీష్, (జీతం: 12K to 14K) 3rd to 5th హిందీ, జీతం:12K మరియు 6th to 8th సోషియల్ (16K to 20K), 8th to 10th మ్యాథ్స్ (25K to 30K) అర్హత, అనుభవముకల్గిన ఉపాధ్యాయులు కావలెను. వెంటనే సంప్రదించండి సెల్:90590 04664, 92926 07689
Ajc-196462

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. నంబరు 7382114647
AJA- 189272

FLATS FOR RENT
Galaxy apple, Door. No. 31/4111, Opp road to HP Gas Godown, Machupalli road, Kadapa-2, flats for rent Double bedrooms & 3 bedrooms
Contact:9990662217, 9866081170
AJC-188914

CHANGE OF NAME
★ I Syed Mahboob Khursheed, residing No.4-29-3-2-6-1-A, Indira Nagar, Jhande Ki Gali, Madanapalle, Annamayya, Kadapa, Andhra Pradesh-517325 has changed my Name as Khursheed sworn before advocate & Notary Smt. A. Manjula date 02.07.2024 AJQ-059907

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

16 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

రాజంపేట, జూలై 4: రాజంపేట అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్ధేశ్వరస్వామి ఆలయంలో 16న అంకురార్పణ, 18న పల్లకిసేవ, చంద్రప్రభ వాహనం ఉంటుందన్నారు. 19న చిన్నశేషవాహనం, 20న సింహవాహనం, 21న నందివాహనం, 22న కల్యాణోత్సవం, 23న పల్లకి సేవ, 24న పారువేట ఉత్సవం, 25న వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజారోహనం, 26న స్తపన తిరుమంజనం, పుష్పయాగం ఉంటుందన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో...

చెన్నకేశవస్వామి ఆలయంలో 16న దీక్షా తిరమంజనం, అంకురార్పణ, 17న ధ్వజారోహణం, శేషవాహన సేవలు ఉంటాయన్నారు. 18న హంసవాహనం, పల్లకిసేవ, 19న సింహవాహనం, 20న హనుమంతవాహనం, 21న మోహినీ అవతారం, గరుడవాహన సేవ ఉంటుందన్నారు. 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న అశ్వవాహనం, 25న చక్రస్నానం, ధ్వజారోహణం, 26న స్నపన తిరుమంజనం, పుష్పయాగం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

క్లోరినేషన్ పాటించండి : డీఎల్‌పీవో


మంచినీటి ట్యాంకులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పార్వతి

నందలూరు, జూలై 4: మంచినీరు సరఫరా చేస్తున్న ట్యాంకుల్లో క్లోరినేషన్ నిర్వహించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజంపేట డివిజనల్ పంచాయతి అధికారి (డీఎల్‌పీవో) పార్వతి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతి కార్యక్రమంలో పలు మంచినీటి ఉపరితల ట్యాంకులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

రాజంపేట, జూలై 4: ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర టీచ్‌టూల్ పరిశీలకుడు సాయిరాం పేర్కొన్నారు. గురువారం రాజంపేట మండలం కొత్తబోయనపల్లె ఉన్నత పాఠశాలలో రాజంపేట డివిజన్‌కు సంబంధించిన 90 మంది ఉపాధ్యాయులకు బోధన సామర్థ్య శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యాబోధన సాగించాలని, ఇందుకు అవసరమైన మెళకువలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి చక్రధర్, స్పోర్ట్స్ డైరెక్టర్ భారతి, శివరాంప్రాద్, రాజేష్, కృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు జీతాలివ్వండి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 4: జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గత 17 నెలలుగా జీతాలు అందడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. ఈ విషయంపై గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌరవేతనం లేక తమ కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం, ఇతర అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ఈ విషయమై జిల్లా అధికారులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

దాహార్తిని తీర్చాలంటూ మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం, జూలై 4: మాధవరం-1 గ్రామ పంచాయతి ఎస్‌కెఆర్ నగర్‌లో గత కొన్ని రోజుల నుంచి తమ ప్రాంతంలో వాటర్ ట్యాంకు నుంచి మంచినీరు రావడంలేదని మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులకు తాగునీరును అందించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా వారు ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని, తాగునీరు లేకపోతే ఎలా జీవనం సాగించాలన్నారు. మంచినీటి సమస్య పరిష్కరించకపోతే సచివాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతి కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా.. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి మంచినీటి సమస్య ఒక వారంలో పరిష్కారం చేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు తప్పవు

పుల్లంపేట, జూలై 4: ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు ఆక్రమిస్తే ఆక్రమణదారులపై చర్యలు తప్పవని తహసీల్దారు వెంకటనారాయణ హెచ్చరించారు. అనంతసముద్రం పంచాయతీ దాసరిపల్లె సమీపంలో సర్వేనంబరు 137లో ముద్దావాళ్ల కుంట ఆక్రమణపై ఫిర్యాదులు రావడంతో సర్వే చేసి 6 ఎకరాల ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్‌వో నరసింహులు ఆక్రమితకుంటలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

టీడీపీ నాయకుడు మృతి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు, జూలై 4: టీడీపీ సీనియర్ నాయకుడు పొన్నరంగన్‌గౌడ్ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య కారణాలతో బాధపడుతుండేవాడు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ బుధవారం రాత్రి ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, టీడీపీ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ నాయకులు పొన్నరంగన్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోరాటయోధుడు.. మన్యం వీరుడు


రాయచోటి కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టరు, విజయవాడ కార్యాలయంలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రూపానందరెడ్డి, భాకరాపేట బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, రాజంపేటలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు,

● ఘనంగా అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 4: స్వరాజ్య సంగ్రామ చరిత్రలో అల్లూరి మహోజ్వల శక్తి,మాన్యం వీరుడు, అల్లూరి సీతారామారాజు అని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, ఏఓ గోవిందసింగ్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో గురువారం అల్లూరు సీతారామరాజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, పార్లమెంట్ అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు, పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మైనార్టీ నాయకులు అబూబకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆదినారాయణ, పాపయ్య, శ్రీనివాసులు, రమణ, ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: స్వరాజ్యం కోసం అల్లూరి సీతారామరాజు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గద్దం చంగల్రాజు, రైల్వేకోడూరు క్షత్రియ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి గృహ సమీపంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, తాటి సుబ్బరాయుడు, మోడపోతుల రాము, హిమగిరినాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

సిద్దవటం: భాకరాపేట పోలీసు 11వ బెటాలియన్‌లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ముఖ్యఅతిథిగా విచ్చేసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వి.జయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరు: మన్యం వీరుడు భావితరాలకు ఆదర్శప్రాయుడని ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రియాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్-1, 2 ప్రోగ్రాం అధికారుల ఆధ్వర్యంలో అల్లూరు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ హేమలత, గౌస్‌మోదిన్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 4: జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ, మండల నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలను ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు నీతిఅయోగ్ కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం జూలై 4 నుంచి సెప్టెంబరు ఆఖరి వరకు దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి స్థితిగతులను 40 అంశాలపై ఆయా గ్రామాలకు కేటాయించిన అధికారులు పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు. డీఎంహెచ్ఓ కొండయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది పర్యవేక్షించి గర్భవతులను గుర్తిస్తే వెంటనే ఆ మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం వలన ఆమెకు ప్రతి నెల అందాల్సిన టీకాలు, మందులు సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశికళ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గురుప్రసాదు, సీడీపీఓ రమాదేవి, ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటరెడ్డయ్య, దేవళంపల్లె, కోనంపేట వైద్యులు, వ్యవసాయశాఖ ఏడీ విజయరాణి, ఏఓ బాబురమేష్‌బాబు, నీతిఅయోగ్ అధికారి వెంకరామిరెడ్డి, అంగన్ వాడీ కార్యకర్తలు, సర్పంచులు, పాల్గొన్నారు.

ఏటి పొరంబోకు స్థలాన్ని ఆక్రమించుకున్నారని నిరసన


రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, జూలై 4: మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలోని సమతానగర్ గ్రామానికి సమీపంలో ఉన్న ఏటి పొరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారని సమతానగర్‌కు చెందిన మహిళలు రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుజాత, కళావతి, విజయ, అంజలిలు మాట్లాడుతూ 22 మందికి గతంలో ప్రభుత్వం ఆవులు ఇచ్చారని, వాటిని మేపుకునేందుకు ఏటి పరంబోకు స్థలాన్ని మేతబీడుగా ఉపయోగించుకుంటున్నారు. కానీ సమతానగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఏటి పొరంబోకు స్థలాన్ని ఆక్రమించుకోవడం వల్ల మేతబీడు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను రెవెన్యూశాఖ అధికారులు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమతానగర్ వాసులు కంచన్న, మునిమల్ల, పుష్పలత, నారాయణమ్మ, భాగ్యమ్మ, కుమారి, గంగమ్మ, జయమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం


రాజంపేటలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజంపేటటౌన్, జూలై 4: నీట్ పరీక్ష లీకేజిని నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను గురువారం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను మూసివేయించి బంద్ నిర్వహించాయి. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సుదర్శన్, యశ్వంత్, ప్రవీణ్, కుమార్, సాయి, ఇమ్రాన్, చందు, ప్రసాద్, వినోద్, తదితరుల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించి విద్యాసంస్థలను మూయించారు.

రైల్వేకోడూరు: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ కారణంగా పాఠశాలలు, కళాశాలు మూసివేయించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ బాలసుబ్రహ్మణ్యం, రమణలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, సిసింద్రీ, ప్రసాద్, వెంకటరమణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: విద్యార్థి సంఘం నాయకులు నిర్వహించి తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్లు ఏపీఎస్ఎఫ్ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నీట్ పరీక్ష లీకేజీపై నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మండలంలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు.

లక్కిరెడ్డిపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బంద్‌కు నిరసనగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు మద్దతు తెలుపుతూ గురువారం లక్కిరెడ్డిపల్లెలో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు మూసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుటాకులపై పగపట్టారు..!


రాయచోటి కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన వృద్ధులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 4: జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించి చివరి రోజుల్లో ప్రభుత్వం అందించే పింఛనుతో కాస్త గంజి తాగుతుంటే అది కూడా చూసి ఓర్వలేక నోటికాడ కూడును కాళ్లతో తన్నుతున్నారంటూ వృద్ధులు జాయింట్ కలెక్టరుకు గోడు వెల్లబోసుకున్నారు. గురువారం వారు రాయచోటి కలెక్టరేట్‌కు వచ్చారు. కలకడ మండలం నడిమిచెర్ల గ్రామంలో వుండే నల్లపరెడ్డి, శిద్దమ్మ, అనసూయమ్మ, గంగిరెడ్డి, రామచంద్రలు దాదాపు 5 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం మారిందని వారికి పింఛన్ ఇవ్వద్దని కొందరు నాయకులు అడ్డు చెప్పడంతో సచివాలయ సిబ్బంది తమకు పింఛను ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని చూసి చలించిన జాయింట్ కలెక్టర్ రెండు రోజుల్లో మీకు పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోంటానని హామీ ఇవ్వడంతో వెళ్లిపోయారు.

దండోరా.. జనజాతరను విజయవంతం చేయండి

● ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు

రాయచోటిటౌన్, జూలై 4: ఈదుముడిలో ఈ నెల 7న జరగనున్న దండోర జనజాతరను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద మాదిగ జనజాతర కరపత్రాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని దండోర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి సీఆర్‌సీకి ఘనసన్మానం


రామచంద్రయ్యను సత్కరిస్తున్న రాజంపేట టీడీపీ నేతలు

రాజంపేట,జూలై 4: మాజీ మంత్రి సి.రామచంద్రయ్యను రాజంపేట నేతలు ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న నేపథ్యంలో కడపలోని ఆయన స్వగృహానికి వెళ్లి భారీ పూలమాలలతో, శాలువాలతో సత్కరించి ఆయనకు అభినందనలు తెలిపారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు తోట రామయ్య, ఊటుకూరు టీడీపీ నాయకులు నామా హరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, చిట్వేలి మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, ఇంజనీరింగ్ కోచింగ్ సెంటర్ అధినేత సుబ్బయ్యరాయల్, కంబాలకుంట నాయకులు శివ, బీజేపీ నాయకులు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉగ్రవీంద్ర, మైనార్టీ నాయకులు షబ్బీర్‌అలీ, నారాయణనెల్లూరు నాయకులు రెడ్డయ్యరాయల్ ఉన్నారు.

విద్యార్థులకు పోలీసుల రక్షణ కల్పించాలి

పెనగలూరు, జూలై 4: పాఠశాల పనివేళల్లో విద్యార్థులకు పోలీసు రక్షణ కల్పించాలని పెనగలూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయబృందం స్థానిక ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆయన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల స్థితిగతుల గురించి ఆరా తీశారు. శాంతిభద్రతలకు ఏదైనా సమస్య ఉంటే తెలపాలని కోరగా పెనగలూరు ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అన్నీ ఒకేచోట దగ్గరగా ఉన్నందున వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళుతుంటారని తెలిపారు. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులు వచ్చి పోయేటప్పుడు ఒకే రహదారిపై చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం, సాయంత్రం అరగంట సేపు పోలీసులు పహారా కాస్తే ఆకతాయిల బెడద నుంచి కాపాడవచ్చన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు పోలీసును విధుల్లో ఉంచుతామని హామీ ఇచ్చారు.

డీబీఎన్‌పల్లెలో తల్లిదండ్రుల సమావేశం

రాజంపేటటౌన్, జూలై 4: రాజంపేట మండలం డీబీఎన్‌పల్లెలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. గురువారం ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు స్వర్ణలత, రంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రాథమిక దశ నుంచే సత్ప్రవర్తనతో పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకంటే తల్లిదండ్రులదే కీలకపాత్ర అన్నారు. తల్లిదండ్రులు అందరూ సహకరిస్తే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మోడల్‌స్కూల్‌కు ఎంపిక కావడానికి జరిగిన రాత పరీక్షలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

వైభవంగా గంగమ్మ జాతర

రైల్వేకోడూరు, జూలై 4: మండలంలోని వీవీకండ్రికలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పిల్లలు వేపమండలు కట్టుకుని గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి మేకపోతులు, పొట్టేళ్లు, కోళ్లు సమర్పించుకున్నారు. ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. వీధుల్లో చలువ పందిర్లు వేశారు. వందలాది మంది భక్తులు జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగ జయంతి

రైల్వేకోడూరు, జూలై 4: పట్టణంలోని శ్రీక్రిష్ణదేవరాయులు విగ్రహం వద్ద దివంగత ఎమ్మెల్యే వంగవీటి రంగ జయంతి సందర్భంగా గురువారం రైల్వేకోడూరులో కాపు నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కేకు కట్‌చేసి అభిమానులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కాపు నాయకుడు చెన్నంశెట్టి చలపతి మాట్లాడుతూ వంగవీటి రంగను కాపులు, బలిజలు తదితరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

● బీజేపీ యువనాయకులు

ఓబులవారిపల్లె, జూలై 4: పేద వర్గాలు ఉన్న మారుమూల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని డాక్టర్ గురు మహేష్‌ను బీజేపీ యువ నాయకులు జైభరత్‌రెడ్డి కోరారు. వర్షాకాలం వచ్చిన సందర్భంగా దోమలు, ఈగలు వ్యాప్తి ఎక్కువగా అయి రోగాలబారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా వైద్యశిబిరాలు నిర్వహించడం ద్వారా పేదవర్గాల వారికి సహాయం చేసినవారవుతారని వివరించారు. మారుమూల గ్రామాలైన గాదెల ఎస్టీ కాలని వంటివి చాలా ఉన్నాయని, పేదలు జబ్బు చేసి పట్టణాలకు వెళితే ఆస్తులు అమ్ముకున్నా సరిపోవని, ఇలాంటి ఘటనలు కూడా ఉన్నాయని బీజేపీ యువ నాయకులు జైభరత్‌రెడ్డి తెలిపారు.

'స్టేట్ సిలబస్ మాత్రమే బోధించాలి'

ఒంటిమిట్ట, జూలై 4: ప్రైవేటు పాఠశాలలో స్టేట్ సిలబస్‌ను మాత్రమే బోధించాలని ఎంపీడీవో వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా పరిశీలించారు. అధిక ఫీజులు వసూలు చేసిన విద్యార్థులకు తప్పుడు సమాచారంతో సెంట్రల్ సిలబస్ చేపడతామని అడ్మిషన్లు చేపట్టిన స్కూళ్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో స్టేట్ సిలబస్ మాత్రమే విద్యార్థులకు బోధించాలని, సెంట్రల్ సిలబస్ బోధించేందుకు ప్రభుత్వం నుండి అనుమతి లేదన్నారు.





అప్పుడు అయ్యాఎస్!

జనవరి 31: తిరుపతి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా ఆ వెంటనే అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేసి విధేయతను ప్రకటించుకున్నారు.

జగన్‌రెడ్డి పాలన తీరుకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనకూ ఉన్న తేడాను ఈ ఫొటోలు చాటిచెబుతున్నాయి.ఎంతస్థాయి అధికారులైనా ఎమ్మెల్యేలకు అణగిమణిగి ఉండాల్సి వచ్చేది. ఐఏఎస్, ఐపీఎస్ అధికార హోదాలు నాయకుల ముందు తలవంచాల్సి వచ్చేది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. అధికారులకు తగిన మర్యాద ఇవ్వాలని సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెబుతూవచ్చారు. దీంతో అధికారులే కాదు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ మారారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు ఐఏఎస్!

జూలై 4: తిరుపతి కలెక్టర్‌గా ఎస్. వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలెక్టరేట్‌కు వెళ్లి, కొత్త కలెక్టర్‌కు శాలువాకప్పి శ్రీవారి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.చంద్రగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు నాని, ఆదిమూలం కూడా కలెక్టరేట్‌లోనే కొత్త కలెక్టర్‌ను కలిశారు.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పుంగనూరు రూరల్, జూలై 4: అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మునిరాజ(45) 30 ఏళ్ల కిందట పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ పెద్ద గడిదేశికి చెందిన అమరావతిని వివాహం చేసుకుని ఇక్కడ స్థిరపడ్డారు. పంటల సాగుకు జువ్వలదిన్నెతాండాకు చెందిన ఓ వ్యక్తి వద్ద అప్పులు చేశారు. అప్పు ఇచ్చిన వ్యక్తి బుధవారం మునిరాజ ఇంటికి వెళ్లి ఉదయానికంతా డబ్బులు ఇవ్వకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతిచెందారు. ఉదయాన్నే కుటుంబసభ్యులు వెతకడంతో పొలంలోని చెట్టుకు వేలాడుతున్నట్లు గుర్తించి కర్ణాటకలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని తమ సొంత గ్రామానికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు చెప్పారు.

పంచాయతీలకు రూ.1.67 కోట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4: కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పంచాయతీలకు నిధుల రాక ప్రారంభమైంది. గత ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే నిధులను వివిధ పథకాలకు మళ్లించిన విషయం తెలిసిందే. అలా నిర్వీర్యమైన పంచాయతీలను కొత్త ప్రభుత్వం పునరుద్ధరించే పనిలో పడింది. గురువారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి త్రైమాసికం కోసం నిధులు విడుదల చేసింది. 695 పంచాయతీలకు వృత్తి పన్ను పద్దు కింద రూ.34,60,172, తలసరి గ్రాంట్ పద్దు కింద రూ.19,87,711 సర్పంచుల జీతభత్యాల రూపేణా రూ.1,16,72,000 మంజూరయ్యాయి. ఈ మొత్తాలను రెండ్రోజుల్లో పంచాయతీల ఖాతాలకు జమ చేస్తామని డీపీవో లక్ష్మి తెలిపారు.

20 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా కార్వేటినగరంలో 45.2మి.మీ., అత్యల్పంగా శాంతిపురంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పాలసముద్రం 37.2, గంగాధరనెల్లూరు 22.0, పులిచెర్ల 21.0, వెదురుకుప్పం 19.2, విజయపురం 12.8, సోమల 12.8, పుంగనూరు 12.0, పెనుమూరు 11.6, పూతలపట్టు 11.4, నగరి 10.4, సదుం 10.2, చిత్తూరు అర్బన్ 8.0, ఐరాల 7.2, శ్రీరంగరాజపురం 7.2, వి.కోట 6.6, యాదమరి 6.6, బంగారుపాళ్యం 6.2, నింద్ర 5.2, గంగవరం 2.4, చిత్తూరు రూరల్ 2.4, పెద్దపంజాణి 2.2, తవణంపల్లె 2.2, చౌడేపల్లిలో 1.8 మి.మీ వర్షం కురిసింది.

ఢిల్లీకి చేరిన ప్రపంచ శాంతి యాత్రికుడు బషీర్



ఎర్రకోట వద్ద బషీర్

పలమనేరు, జూలై 4: పలమనేరుకు చెందిన ప్రపంచ శాంతి యాత్రికుడు బషీర్ అనే యువకుడు గురువారం ఢిల్లీలోని ఎర్రకోట వద్దకు చేరాడు. బషీర్ 20 రోజుల క్రితం ప్రపంచ శాంతి కోసం పలమనేరు నుంచి లడక్‌కు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ క్రమలో ఢిల్లీ చేరాడు. అక్కడినుంచి లడక్‌కు వెళ్లనున్నాడు. ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నందున బుధవారం తన ప్రయాణాన్ని ఢిల్లీలో నిలిపి వేశానని ఇక్కడి స్నేహితులకు సమాచారం ఇచ్చారు. తాను తీసుకెళ్లిన డబ్బులు ఐపోయాయని తనకు ఎవరైనా ఆర్థిక సాయం అందించాలని ఇక్కడి సోషియల్ మీడియా వారికి బషీర్ విజ్ఞప్తి చేశాడు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 4: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ మణికంఠ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా, పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ పొగాకు నియంత్రణ సంస్థ, రాష్ట్ర ప్రజారోగ్య శాఖ, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో పోలీసు శిక్షణా కేంద్రంలో పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధులతో ఏటా రాష్ట్రంలో 48వేల మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో 5,500మంది పిల్లలు ప్రతిరోజూ పొగాకు వాడకాన్ని ప్రారంభిస్తున్నారన్న విషయం ఆందోళన కలిగిస్తోందన్నారు. మత్తుమందును పిల్లలకు ఇచ్చినట్లయితే ఏడేళ్లు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీఫుల్లా, డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్, హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్‌కుమార్,డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

24 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతి

తిరుపతి(విద్య), జూలై 4: రాష్ట్రంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికిగాను ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇస్తూ ఏఐసీటీఈ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,080.. 21 ప్రైవేట్ కళాశాలల్లో 18,900 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, మొత్తంగా 24 కళాశాలల్లో 19,980 ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే తిరుపతి జిల్లా పుత్తూరు ఇప్పతంగలి గ్రామం ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చింది.

ఆక్రమణలో బలిజ 'కమ్యూనిటీ' స్థలం

కుప్పం, జూలై 4: చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుప్పంలో బలిజలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.2.46 ఎకరాలను కేటాయించారు. ఈ విలువైన స్థలం దురాక్రమణకు గురైంది. తమ స్థలాన్ని వైసీపీకి చెందిన ఒక నాయకుడు కబ్జా చేశాడంటూ బలిజ కులస్థులు గురువారం కుప్పంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక కుప్పంలో పర్యటించిన సమయంలో బలిజ కులస్థుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు కుప్పం పురపాలక సంఘం పలార్లపల్లె దగ్గర 2.46 ఎకరాలను కేటాయిస్తూ అప్పట్లో జీవో జారీ చేశారు. కమ్యూనిటీ భవనం నిర్మాణంకోసం రూ.కోటి మంజూరు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ అంశాన్ని పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. ఆపైన స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు బలిజ కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారన్న ఆరోపణలు బయలుదేరాయి. గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దీని గురించే బలిజ కులస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన భూమి దురాక్రమణకు గురైంది కాబట్టి, సదరు స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణలనుంచి కాపాడాలని ఆయనకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బలిజ కులస్థులు

- శాంతిపురం మండలం దొంకుమానిపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 55/2లో పేదల ఇళ్ల స్థలాలకోసం కేటాయించిన భూమి దురాక్రమణకు గురైందని ఎమ్మార్పీస్ నాయకుడు దేవరాజ్ మాదిగ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనితోపాటు వెదురుగుట్టపల్లె సర్వే నెంబర్ 34లో 59 ఎకరాల పశువుల మేత బీడు, అమ్మవారి పేట కార్గో ఎయిర్‌పోర్ట్ దళితుల సమస్యలను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. శాంతిపురంలోని శ్మశాన, సంత నిర్వహణకుగాను పాలారు నది స్థలాన్ని కేటాయించాలని కోరారు.
- గుడుపల్లె మండలం శెట్టిపల్లె, కప్పలనత్తం చెరువలను కొందరు కబ్జా చేసి ఇళ్ల స్థలాలు వేశారని గ్రామస్థులు కొందరు ఫిర్యాదు చేశారు. ఆయా చెరువులను కబ్జాదారుల చెరనుంచి విడిపించాలని కోరారు.

కౌన్సిల్ సమావేశాలకు అధికారులు సహకరించడంలేదు

కుప్పం, జూలై 4: కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు అధికారులు సహకరించడంలేదని ఛైర్మన్ డాక్టర్ సుధీర్ గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో చిన్నచిన్న అభివృద్ధి పనులు నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి వెంటనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని కమిషనరును ఆదేశించారు. మున్సిపల్ ఛైర్మన్‌తోపాటు వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'అంతిమ సంస్కారం' ఎలా?

నీవానది యేటిఒడ్డు ప్రాంతమే శ్మశానవాటిక ● మృతదేహాలను తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో?



శ్మశాన దారిలో బురద కారణంగా ఆపేసిన స్వర్గధామం వాహనం, వ్యాన్‌లో నుంచి ట్రాక్టర్‌లోకి మృతదేహాన్ని మారుస్తున్న మృతుడి బంధువులు

గంగాధరనెల్లూరు, జూలై 4: గంగాధరనెల్లూరులో ఎవరైనా మృతిచెందితే.. అంతిమ సంస్కారాలకు తీసుకెళ్లాలంటే అవస్థలు తప్పడంలేదు. అందుకు గురువారం జరిగిన ఘటనే నిదర్శనం. గంగాధరనెల్లూరుకు శ్మశానవాటికకు స్థలం కేటాయించలేదు. ఏళ్ల తరబడి నీవానది ఒడ్డు ప్రాంతాన్నే శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారు. నీవానది బ్రిడ్జికి గతంలో ఎగువ భాగంలో కొందరు, దిగువ భాగంలో మరికొందరు అంత్యక్రియలు చేస్తున్నారు. గంగాధరనెల్లూరులోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను బ్రిడ్జిపై నుంచి, శ్మశానవాటికకు వెళ్లే దారి పొడవునా పారబోస్తున్నారు. మరికొందరు పాత ఇళ్లను తొలగించాక వృథా రాళ్లు, మట్టిని, ఇళ్లల్లో నుంచి సేకరించే చెత్తచెదారాన్ని శ్మశానానికి వెళ్ళే దారిపక్కన డంపు చేస్తున్నారు. ఈ చర్యలతో ఆ దారిలో మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే దుర్గంధం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో గంగాధరనెల్లూరు (దిగవూరు)కు చెందిన ఓవ్యక్తి మరణిస్తే గురువారం అతడి మృతదేహాన్ని స్వర్గధామం వాహనంలో నీవానది యేటి ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆ దారి కొంతదూరం బురదమయంగా మారడంవల్ల మృతదేహం ఉన్న వాహనాన్ని ముందుకు తీసుకెళితే కూరుకుపోతుందని డ్రైవర్ చెప్పారు. అందువల్ల వాహనాన్ని గుంత వరకు తీసుకెళ్లలేమని ఆపేశారు. ఆ బురదదారిలో మృతదేహాన్ని మోసుకెళ్లాలన్నా సాధ్యంకాని పరిస్థితి. చివరకు అక్కడకు వచ్చిన కొందరు సమీపంలోని రాళ్లను తీసుకొచ్చి బురదలోకి వేసి మృతదేహాన్ని తీసుకెళ్ళాలన్నా సాధ్యం కాలేదు. అదే సమయంలో గంగాధరనెల్లూరు పంచాయతీకి చెందిన ట్రాక్టర్ గ్రామంలో సేకరించిన చెత్తచెదారాన్ని డంప్ చేసేసి నీవానదిలో పక్కన పెట్టుకుని ఉంటే ఆ డ్రైవర్‌ను ఒప్పించారు. ఆ ట్రాక్టర్ ట్రాలీలోకి మృతదేహాన్ని మార్చి బురదదారిని దాటించుకుని శ్మశానంలో గుంతవరకు తరలించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు మానసిక వేదనకు గురయ్యారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి గంగాధరనెల్లూరుకు శ్మశాన వాటిక సమస్య తీర్చాలని కోరుతున్నారు. నీవానది యేటిఒడ్డు ప్రాంతాన్ని శ్మశానంగా వాడుతున్న స్థలాన్ని, దారిని ఎత్తుపెంచి ఆ ప్రాంతంలో వ్యర్థాలను డంప్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

శాఖాపరమైన విచారణ వేగిరపరచండి

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల వేడుకోలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 4: ఉత్త పుణ్యానికి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కేసులను త్వరగా పరిష్కరించి ఆదుకోవాలని విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏసీబీ, ప్రభుత్వ ఆస్తులు, ధనాన్ని కాజేసిన కేసుల విషయంలో తాము సహాయాన్ని అర్థించడం లేదన్నారు. కానీ రెవెన్యూ శాఖలో చాలామంది ఉద్యోగులు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండానే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారు రిటైర్ అయ్యాక ఆర్థికంగా, కుటుంబపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కేసుల్లో విచారణాధికారులు త్వరగా విచారణ పూర్తిచేయక పోవడంతో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందక వారి జీవనం అస్తవ్యస్తం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే మతిచలించి తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు అధికారులైతే భరించలేని భాషను వాడుతూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలపై విచారణ ఎదుర్కొంటున్నవారు జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారి కేసులను సత్వరం విచారించి.. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని విన్నవించారు. ఇప్పటికే అధికారుల చుట్టూ తిరిగి, ప్రెస్‌మీట్లు పెట్టి వయోభారంతో అలసిపోయానని, ఇదే తన చివరి ప్రెస్‌మీట్ అని గద్గద స్వరంతో అన్నారు. సమావేశంలో విశ్రాంత ఉప తహసీల్దార్ పీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జయచంద్ర

ఇంజనీర్లు లేకుండా పనులెలా చేస్తారు?

- పుంగనూరులో అర్ధరాత్రి పీఎల్ఆర్ కంపెనీ తారు రోడ్డు నిర్మాణం
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు ● పోలీసుల జోక్యంతో సాగిన పనులు



రోడ్డు పనులను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు.. ఆ తర్వాత జరుగుతున్న పనులు

పుంగనూరు, జూలై 4: ఇంజనీర్లు లేకుండా రోడ్డు పనులు ఎలా వేస్తారంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. పుంగనూరులో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పీఎల్ఆర్ కంపెనీ వేస్తున్న తారు రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చౌడేపల్లె రోడ్డులో గతంలో కాంట్రాక్టర్ తారు రోడ్డు వేసి రెండోలేయర్ బీసీ సెన్సార్ ప్లేవర్ వేయాల్సిఉంది. కొద్ది రోజులుగా పుంగనూరులో వైసీపీకి ఎదురుగాలి వీస్తుండటంతో అసంపూర్తి పనులు అర్ధరాత్రి ముగించాలని భావించారు. ఈ క్రమంలో తారు మిక్సింగ్ టిప్పర్, యంత్రాలు వచ్చి రోడ్డుపని మొదలు పెట్టాయి. దీనిని గమనించిన టీడీపీ శ్రేణులు అర్ధరాత్రి రోడ్డు వేయడం ఏంటని, ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడ ఉన్నారంటూ, దొంగగా ఎవరూలేని సమయంలో రోడ్డు వేయరాదంటూ పని ఆపాలని అడ్డుకున్నారు. దీంతో రెండు వాహనాల్లో పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి మళ్లీ 11.30 గంటలకు పనులు చేసుకోవాలని సూచించారు. తారురోడ్డు వేసేముందు ఎయిర్‌కంప్రషన్‌తో శుభ్రం చేయాలని, సెన్సార్ ప్లేవర్‌తో వేయాల్సిన రోడ్డు మెకానికల్ ప్లేవర్‌తో వేస్తూ తారు లిక్విడ్ వేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ అధికారులు లేకుండా అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, ఈపనికి ముందే బిల్లు అయిపోయి ఉంటుందనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామని వారు తెలిపారు. ఏదైనా ఉంటే శుక్రవారం చూసుకోండని, వాళ్లు రోడ్డు వేసుకుంటారని చెప్పి పోలీసులు టీడీపీ వాళ్లను పంపేశారు. ఆ తర్వాత చకచకా రోడ్డు పనులు చేశారు.

చంద్రబాబు పోస్టరుకు ఆవు పేడ

- వైసీపీ కన్వీనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

శాంతిపురం, జులై4: శాంతిపురం మండలం కడపల్లె సచివాలయం గోడకు అంటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరుకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఆవు పేడ పూశారు. ఇది మండల వైసీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి పనేనంటూ టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ కనుమలదొడ్డికి చెందిన దండపాణి వర్గీయులు ఆవు పేడను పూసి అశుభ్రపరిచారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఈ నెల ఒకటిన పెన్షన్ పంపిణీ సందర్భంగా సచివాలయం గోడకు ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరును అతికించి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. బుధవారం రాత్రి దండపాణి అనుచరులు జన్మదిన వేడుకలు జరుపుకొని హంగామా చేశారు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు చంద్రబాబు పోస్టరుకు ఆవుపేడ పూయడాన్ని గమనించిన స్థానికులు టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. వాళ్లు అక్కడికి వచ్చి.. పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణకు తెలిపారు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, దండపాణి కోసం పోలీస్ స్టేషన్ వద్దకు ఎమ్మెల్సీ భరత్ రాగా.. సీఎం పోస్టరుకు పేడ పూసి అవమానించిన వ్యక్తికి సపోర్టుగా రావడం సరికాదంటూ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాగ్వాదంతో స్టేషన్ వద్ద కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

ONE/TWO/SITTING
ఒకే సం//లో INTER, DEGREE, B.COM, BCA, BBA, BBM, B.SC, DIPLOMA, B.Tech, EEE, ECS, CIVIL, MAC (ALL BRANCHES), B.Ed, NURSING AARYA ONLINE COLLEGE, TPT. 93936 22612
AJT-4080

WANTED
తిరుపతిలో 20,000/- జీతంతో ప్రముఖ కొరియర్ కంపెనీలో ఉద్యోగావకాశము కలదు. బైక్ మరియు మొబైల్ కలిగి వుండాలి. వివరాలకు : 99855 04732, : 91775 41210.
AJT - 4084

WANTED
Wanted Female Tele Callers, Salary Rs.20,000/- pm + Incentives upto Rs.25,000/-, Qua-Inter/Degree, RKC Group: 90006 37999, 88015 02343.
AJT-4076

WANTED
Wanted to HR Manager:5Y Exp, Senior Accountant:5Y Exp, Pharmasist:1Y Exp, Computer Operators:1Y Exp, work in Tirupati, Cont: megamedicals. ceo@ gmail.com
AJT-4074

TAX CONSULTANTS
File Income Tax Returns, GST, Company Registration, ROC Fillings, Website Design, Business Registration, Vehicle Insurance, Digital Marketing at Low Prices, Call or Whatsapp 7207446677
AJT - 187457

PEST CONTROL
మీ పరిసరాలను దోమలు, బొద్దింకలు, ఎలుకలు, బల్లులు మరియు నల్లులు నుంచి సంరక్షించుకోండి. చెదలు నివారణ మా ప్రత్యేకత. తిరుపతిలో 25 సం॥ పైగా ఉత్తమ సర్వీసును అందిస్తున్న మరియు ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఏకైక సంస్థ. గ్యారంటీతో సర్వీసు చేయబడును. సెల్ : 9848315414
AJT - 179600

HOUSE FOR SALE
తిరుపతి కొర్లగుంటలోని హచ్ టవర్ పక్కన 16" అంక" (G+F+S) ఫ్లోర్లతో పడమర ముఖం గల ఇల్లు అమ్మకానికి కలదు. సం.ప్ర. సెల్: 98494 45835
AJT-10618

విహారయాత్రలు
వాడపల్లి, ఆయినవోలు, బిక్కవోలు, గొల్లల మామిడాల, గాధరాద, పెనుకొండ, మురమళ్ళ తేది:12-07-2024 2 రోజులు టికెట్ 3250/- (బస్సు, రూం+టీ) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-178320

కాశీ, అయోధ్య రైలు యాత్ర
కార్తీకమాసంలో కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, చిత్రకూటం, అలహాబాద్, వింధ్యాచలం, సీతామఢి, గయ, బుద్ధ గయ తేది:14-11-24. 10 రో టికెట్ 18,000/- (బస్సు రూం+ భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR- 178316

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, ఫిట్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189272

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రజలకు దారివ్వు పెద్దిరెడ్డీ.!

- పబ్లిక్ రోడ్డుకు పెట్టుకున్న గేటు
- తొలగింపునకు జనసేన యత్నం
- అడ్డుకున్న పోలీసులపై ఆగ్రహం



పెద్దిరెడ్డి ఇంటి ముందు రహదారికి అడ్డుగా గేటు, గేటు తొలగించాలని పోలీసులతో జనసేన శ్రేణుల వాగ్వాదం

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసుకున్న గేట్లు తొలగించడానికి జనసేన చేసిన ప్రయత్నం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును స్థానికులకు అందుబాటులోకి లేకుండా సొంత ప్రయోజనాల కోసం పెద్దిరెడ్డి వాడుకుంటున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో కిరణ్ రాయల్ నేతృత్వంలో జనసేన పార్టీ శ్రేణులు గురువారం పెద్దిరెడ్డి ఇంటి ముందు ధర్నాకు దిగారు. గేటును తొలగించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ తామే తొలగించడానికి పూనుకున్నారు.జనసేన ఆందోళన సమాచారం ముందే తెలుసుకున్న పోలీసులు కిరణ్ రాయల్ తదితరులను పెద్దిరెడ్డి ఇంటి సమీపంలోని బండారు అంజనేయస్వామి ఆలయం వద్ద బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ ఘటనాస్థలానికి రావాలని డిమాండు చేశారు. గేట్లు తెరిపించి అందుబాటులోకి తీసుకురావాలని నినదించారు. దాదాపు గంటపాటు నిరసన చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు రాకపోవడంతో తామే గేట్లు తొలగిస్తామని జనసేన నేతలు కిరణ్ రాయల్, సుభాషిణి తదితరులు బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లబోయారు. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జనసైనికులను అడ్డుకుని పోలీసు వ్యానులోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గేట్లు తొలగించి రెండు కాలనీల వాసులకు దారి కల్పిస్తామని తాము హామీ ఇచ్చామని, అందులో భాగంగా కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు కిరణ్ రాయల్ చెప్పారు. అయినా పట్టించుకోకపోవడంతో తమ నేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రజలకిచ్చిన మాట కోసం పెద్దిరెడ్డి కోటకు పెట్టుకున్న గేట్లను తొలగించేందుకు వస్తే పోలీసులు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్టు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వం మారినా పోలీసులు మారరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఘటనాస్థలానికి చేరుకున్నారు. గేట్లు తొలగించడానికి రెండు రోజులు సమయం కోరడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్, మనోజ్, సాయి, కుమార్, శేషాద్రి పాల్గొన్నారు.

రూ.5.4లక్షల ఎరువుల విక్రయాలు నిలుపుదల



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న పీలేరు ఏడీఏ రమణరావు

మదనపల్లె టౌన్, జూలై 4: మదనపల్లె పట్టణంలో పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందు దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేసి రూ.5.4లక్షల ఎరువు విక్రయాలను నిలుపుదల చేశారు. గురువారం పీలేరు ఏడీఏ రమణరావు ఆధ్వర్యంలో మదనపల్లె ఏవో నాగప్రసాద్, సిబ్బంది ఎరువుల దుకాణాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ దుకాణంలో రూ.5.4లక్షల విలువ చేసే 10 టన్నుల కాల్షియం నైట్రేట్ ఎరువును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రమణరావు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. అనధీకృత సంస్థల నుంచి ఎరువులు, విత్తనాలు దిగుమతి చేసుకుని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.

38 టన్నుల ఎరువులు నిలుపుదలకు ఆదేశాలు



ఎరువుల దకాణాలలో తనిఖీలు చుస్తున్న వ్యవసాయ అధికారులు

నిమ్మనపల్లె, జూలై 4: మండలంలోని గోడౌన్‌లో ఎలాంటి అనుమతులు లేని 38 టన్నుల ఎరువులను అధికారులు నిలుపుదల చేశారు. మండలంలోని ఎరువుల దుకాణాలలో ఏడీఏ శ్రీలత, ఏవో మురళిమోహన్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 4 ఎరువులు, 2 క్రిమిసం హారక మందుల దుకాణాల్లో తనిఖీలు చేసి రికార్డులు పరిశీలిం చారు. అనంతరం బాలాజీ ఫెర్టిలైజర్స్‌లో తనిఖీలలో భాగంగా ఉన్న స్టాకుకు గానూ గోడౌన్‌లో ఎలాంటి అనుమతులు లేని 38 టన్నుల ఎరు వులను గుర్తించి వాటి అమ్మకాలను నిలుపుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువుల ను కొను గోలు చేసిన వెంటనే బిల్లు తీసుకోవాలని ఒక వేల బిల్లు ఇవ్వకపోతే వెంటనే వ్యవసాయ అధికారులకు పిర్యాదు చేయాల న్నారు. ఫెర్టిలైజర్స్ నిర్వాహకుల షాపు ముందర ధర ల పట్టికను ఖచ్చింగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ నివారణ

వాల్మీకిపురం, జూలై 4: ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ జ్వరాన్ని నివారించవచ్చని వైద్యాధికారులు సూచించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారులు డెంగ్యూపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని గండబోయనపల్లె, కొత్తమంచూరు గ్రామాల్లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా డెంగ్యూ లక్షణాలు గురించి, చికిత్స నివారణ గురించి అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం ఏడీస్ దోమ కాటు ద్వారా వ్యాప్తి జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించి వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు వాణి, రాణి, భారతమ్మ, యంఎల్‌హెచ్‌పీలు మౌనిక, వనిత, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయవ్యాధి దరి చేరదు

తంబళ్లపల్లె, జూలై 4: బీసీజీ టీకా వేయించుకోవడం ద్వా రా క్షయ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి బయటప డవచ్చని వైద్యాధికారి ముని కుమార్ పేర్కొన్నారు. గురు వారం మండలంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధి లో బీసీజీ టీకాతో పాటు డయే రియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిం చారు.. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..క్షయ రహిత సమాజాన్ని స్థాపించాలన్న లక్ష్యంతో వైద్యారోగ్య శాఖ బీసీజీ టీకా కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. గురువారం మండల వ్యాప్తంగా 156 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నిమ్మనపల్లె, జూలై 4: సచివాలయసిబ్బంది సమయపాలన పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని డీఎల్‌డీవో లక్ష్మిపతి సిబ్బందిని హెచ్చరించారు. గురువారం మండంలోని రాచవేటివారిపల్లి పంచాయతీలోని సచావాలయాన్ని ఆకస్మిక తనీఖీలు చేపట్టారు. ఆుతే ఆయన తనిఖీ చేసే సమయంలో కొంత మంది సిబ్బంది లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయసిబ్బంది ఉదయం 10:30 నుంచి సాయత్రం 5గంటల వరకు ప్రజలకు అందుబాటుతో వుండి వారి సమస్యలను తీర్చాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, జూలై4: గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్డెప్ప (52)అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుండావారిపల్లెకు చెందిన రెడ్డెప్ప తన స్నేహితుడు నరసింహులతో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా గత నెల 30న గుర్తు తెలియని వాహనం డీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో గాయపడిన రెడ్డెప్పను మదనపల్లె ప్రభుత్వ సర్వజన భోదన ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యంకోసం తిరుపతి రూయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తాలుకా సీఐ ఎన్ శేఖర్ తెలిపారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు

పీలేరు, జూలై 4: మలేరియాపై యుద్ధంలో భాగంగా దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. దోమల నివారణలో భాగంగా గురువారం ఆయన నేతృత్వంలో పీలేరు మలేరియా సబ్-యూనిట్, తలపుల పీహెచ్‌సీ సిబ్బంది బోడుమల్లువారిపల్లె పంచాయతీలోని మొరవవడ్డిపల్లె చెరువులో గంబుసియ చేప పిల్లల్ని వదిలారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ నీటిలోని లార్వాలను గంబుసియ చేపల వద్ద దోమల వృద్ధిని గణనీయంగా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం, కిటికీలు, తలుపులకు మెష్‌లు అమర్చుకోవడం, నీటి నిల్వ చేసుకునే పాత్రలపై మూతలు పెట్టడం, పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకురాలు కుసుమ కుమారి, సబ్-యూనిట్ అధికారులు విద్యాసాగర్, ముజీబ్, ఏఎన్ఎం భార్గవి, లావణ్య, సీహెచ్‌వో చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు..?

- నోటీసులు జారీ చేసిన ఆగని నిర్మాణాలు
- వీఆర్‌వో ఫిర్యాదుతో కేసు నమోదు
- తనకూ పట్టా ఉందని మహిళ ఆత్మహత్యాయత్నం
- పట్టాలు బోగస్ అంటున్న తహసీల్దార్
- తొలగించాలని నోటీసు జారీ



వివాదానికి కారణమైన స్థలం



అక్రమ కట్టడం ఆపాలని నోటీసు అంటిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)



స్థలంలో ఆత్మహత్యకు యత్నించిన మహిళ రేణుకా

ములకలచెరువు, జూలై 4: ములకలచెరువు మండలంలో ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. వాటిని అడ్డుకోవాలని అధికారులు నోటీసులు జారీచేసినా ఆక్రమణదారులు ఖాతరు చేయడంలేదు. కాగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్దనున్న ప్రభుత్వ స్థలం విషయమై వివాదం తలెత్తింది. ప్రభుత్వ స్థలంలో అక్రమ అట్టడాలు నిలపాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ములకలచెరువు వీఆర్‌వో ఫిర్యాదు మేరకు ఇటీవల కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో ఇక్కడ తనకు కూడా పట్టా ఇచ్చారని, మరో వ్యక్తి నిర్మాణం ప్రారంభిస్తున్నాడని స్థలంలోనే ఓ మహిళ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం ప్రహరీ ఆనుకుని తనకు ఇంటి పట్టా ఇచ్చారని ఓ మహిళ ఇంటి నిర్మాణం చేపట్టింది. కొన్ని రోజులుగా ఇక్కడ ఇంటి నిర్మాణం చేపడుతోంది. అయితే ఇది ప్రభుత్వ భూమని, ఎవరికి పట్టాలు ఇవ్వలేదని, ఇంటి నిర్మాణం ఆపాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇంటి నిర్మాణం ఆపాలని రెవెన్యూ సిబ్బంది అడ్డుతగిలినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై ఇటీవల వీఆర్‌వో గంగాద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నిర్మాణం ఆపేందుకు వెళ్లిన తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇంటి నిర్మాణం చేపట్టిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. అయినా ఇంటి నిర్మాణం ఆపకపోవడంతో చేసేదిలేక గత నెల 25వతేదీన తహసీల్దార్ అనీల్‌కుమార్ సెక్షన్ -7 కింద ఈ నెల 15 లోగా అక్రమ కట్టడం తొలగించకపోతే కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని నోటీసు జారీ చేశారు. నోటీసులను ఇంటి నిర్మాణం చేపట్టిన మహిళ తీసుకోకపోవడం తో అక్కడే నిర్మాణంలో ఉన్న పునాదికి అంటించారు. ఈ క్రమంలో నిర్మా ణం జరుగుతున్న ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని తనకు పట్టా ఇచ్చా రని, ఈ స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణం చేపడుతున్నాడని మహిళ రేణు కా(40) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థలంలోనే పురుగులమందు తాడగంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అవి బోగస్ పట్టాలు..నిర్మాణం ఆపమని నోటీసు ఇచ్చాం

అవి బోగస్ పట్టాలు. ఎంపీడీవో కార్యాలయం వద్దనున్న ఖాళీ స్థలంలో ఎవరికి ఇంటి పట్టాలు జారీ చేయలేదు. ప్రభుత్వ స్థలం కావడంతో నిర్మాణం చేపట్టకూడదని నోటీసులు జారీ చేశాం. అక్రమంగా చేపట్టిన నిర్మాణం తొలగించాలని గత నెల 25న సెక్షన్ -7 కింద నోటీసు జారీ చేశాము. ఈ నెల 15వతేదీలోగా అక్రమ కట్టడం తొలగించాలని నోటీసులో తెలియజేశాం. అక్రమ కట్టడం తొలగించకుంటే కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతాం.

-అనీల్‌కుమార్, తహసీల్దార్, ములకలచెరువు

గ్రామీణుల జీవన ప్రమాణాల మెరుగే లక్ష్యం



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీవో ధనలక్ష్మి తదితరులు

కురబలకోట, జూలై 4: గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని డీపీవో ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్ళులో పీఎం నరేంద్రమోడీ దేశ వ్యాప్తంగా 500మండలాల్లో చేపట్టిన ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలో 7జిల్లాలలో 15మండలాలను ఎంపిక చేయగా మన జిల్లాలో 3మండలాలను ఎంపిక చేశారన్నారు. ప్రధానంగా సుపరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడంతో పాటుగా ప్రభుత్వ సేవలను మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్ళి అందించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 40అంశాలను ఎంపిక చేసి 6అంశాలను సెప్టెంబరు ఆఖరులోగా వందశాతం పూర్తి చేయాలన్నారు. కాగా గర్భవతుల నిర్ధారణ నమోదు, పోషణ సరఫరా, 30 సంవత్సరాలు పైబడిన వారికి అధిక రక్తపోటు, మధుమేహం నిర్ధారణ పరీక్షలు, వ్యవసాయభూమి నాణ్యత పరీక్షలు, స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించడం చేపట్టి ప్రగతిని సాధించాలన్నారు. అనంతరం ప్రతిజ చేశారు. ఆ తర్వాత జడ్పీహైస్కూల్ నుంచి అంగళ్ళు మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేట్టారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ ఉపాధ్యక్షుడు సూరి, సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, ఎంఈవో ద్వారకనాథ్, వైద్యాధికారి శ్రీధర్, ఈఈలు హేమకుమార్, మదన్‌మోహన్‌రెడ్డి, ఈవోపీ ఆర్‌డి అబ్దుల్ సుకుర్, వ్యవసాయాధికారి రాధ, పంచాయతీ కార్యద ర్శులు శేషగిరి పాల్గొన్నారు.

మంత్రి సవిత దృష్టికి మదనపల్లె సమస్యలు



రాష్ట్ర మంత్రి సవితను కలసిన టీడీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు తదితరులు

మదనపల్లె టౌన్, జూలై 4: రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి మదనపల్లెలోని బీసీలు, చేనేత కార్మికుల సమస్యలు తీసుకెళ్లినట్లు టీడీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు పేర్కొన్నారు. గురువారం పెనుగొండలో మంత్రి సవితను కలసిన మధుబాబు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. 2022లో చంద్రబాబు సీఎం కావాలని అప్పట్లో రాష్ట్ర కురబ కార్పొరేషన్ మాజీ అధ్యక్షురాలైన సవిత పెనుగొండ నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లినప్పుడు మదనపల్లెలో ఆమెకు స్వాగతం పలికిన విషయాన్ని గుర్తు చేశారు. మదనపల్లెలో బీసీలు అధికంగా ఉన్నారని వారిని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పూల మురళి, చలపతి నాయుడు, మహేష్, మధుసూదన్, వినోద్‌కుమార్ ఉన్నారు.

అల్లూరి త్యాగం.. అందరికీ స్ఫూర్తిదాయకం

మదనపల్లె టౌన్, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగం అందరికీ స్ఫూర్తిదాయకమని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్‌కలెక్టరేట్ డీఏవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ఖాజావలి, మోహన్‌బాబు, జ్యోతి, వనజ సుబ్బరాయుడు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: తెల్లదొరలపై పోరాడి ప్రాణత్యాగం చేసిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి శీతారామరాజు జయంతిని గురువారం బి.కొత్తకోట పట్టణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పీఆర్ మనోహర్, ఎంపీడీవో కార్యాలయంలో ఏఓ థామస్‌లు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిశేఖర్, ఆర్ఐ బాలాజి, మహేష్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు, స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అని తహసీల్దారు బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి తహసీల్దారు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది నివాళులర్పించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి

వాల్మీకిపురం, జూలై 4: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, ఆధ్యాత్మిక వేత్త వివేకానందస్వామి వర్ధంతి వేడుకలను గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అల్లూరి, వివేకానందల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ వారి సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

పీలేరు, జూలై 4: పీలేరు మండలం గాండ్లపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల రిటైర్డు ఉపాధ్యాయుడు కోటిగారి రామ్మోహన్ గురువారం స్టేషనరీ సామగ్రి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కాలం చేసిన తన తల్లిదండ్రులు, కుమారుడు జ్ఞాపకార్థం ప్రతి ఏటా గాండ్లపల్లెలోని విద్యార్థులకు స్టేషనరీ వితరణగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిద్దప్ప, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.కోటి మంజూరు

నిమ్మనపల్లె, జూలై 4: మండలంలోని తవళం పంచాయతీ అటవీ ప్రాతంలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అదనంగా రూ. కోటి మంజూరు అయినట్లు ఈవో మంజుల తెలిపారు.గరువారం ఆమె మాట్లాడుతూ నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణా నికి మొత్తం 3కోట్ల 20లక్షల రూపాయలు అవసరం కాగా మొదట విడతగా రూ. కోటి మంజూరైందని వాటితో గుడి గోపురం వరకు నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం అదనంగా మరో రూ. కోటి రూపాయలు దేవదాయశాఖ మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో పనులు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

కార్మిక సంక్షేమమే టీఎన్‌టీయూసీ ధ్యేయం

మదనపల్లె అర్బన్ జూలై4:కార్మిక సంక్షేమమే టీఎన్‌టీయూసీ ధ్యేయంగా పనిచేస్తోందని ఆ యూనియన్ అధ్యక్షుడు జేవీ నరసింహమూర్తి పేర్కొన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె స్పిన్నింగ్‌మిల్స్ 2014లో మూసి వేయగా అప్పట్లో కొందరూ గ్రాట్యూటీ రాదు అని కూడా చెప్పారన్నారు. తరువాత బెంగళూరు, అమరావతి కోర్టులకు తిరిగి కష్టపడి కార్మికులకు రావాల్సిన గ్రాట్యూటీ తోపాటు అధనంగా రూ.2.19 లక్షలు సాధించుకున్నామన్నారు. కార్మికుల తరపున యూనియన్ అధ్యక్షుడు నరసంహమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

మిట్స్‌కు అరుదైన గుర్తింపు

కురబలకోట, జూలై 4: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. ఎస్‌సీఐ మాగో ఇనిస్టిట్యూషన్స్ 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి జర్నల్స్, పరిశోధనలు, పేటెంట్‌ల పరిధిలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా 6 కళాశాల లను ఎంపిక చేయగా వాటిలో మిట్స్ అత్యుత్తమమ ర్యాంకులు దక్కించుకుంది. ఈ ర్యాంకులు రావడంతో కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ , డీన్‌లు అభినందించారు.

నేడు భారీ బైక్ ర్యాలీ

వాల్మీకిపురం, జూలై 4: పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వాల్మీకిపురంలో పర్యటించనుండగా భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండబోయనపల్లె వద్ద నుంచి వాల్మీకిపురం ర్యాలీ, అనంతరం ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా బాలికల జట్లు ఎంపిక



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన జిల్లా బాలికల జూనియర్ జట్టు

మదనపల్లె టౌన్, జూలై 4: అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల జూనియర్, సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. గురువారం మండలంలోని వేద హైస్కూల్లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మురళీధర్, కమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో జిల్లా వ్యాప్తంగా 50 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వారి ఆట నైపుణ్యాన్ని పరిశీలించిన సెలెక్టర్లు రెండు జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జూనియర్ బాలికల తుది జట్టును ఎంపిక చేశామని ఈ జట్టు అనంతపురం ఆర్డీటీ మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా సబ్‌జూనియర్ బాలికల జట్టులో 26 మందిని ఎంపిక చేశామనికి వారికి శిక్షణ ఇచ్చాక తుది జట్టును ఎంపిక చేస్తామని, ఈ జట్టు ఆగస్టు నెలలో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. అసోసియేషన్ సభ్యులు మహేంద్ర నాయక్, నరేష్, అంజనప్ప, వేద పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేంద్ర పాల్గొన్నారు.

జూనియర్ బాలికల జట్టు వివరాలు: మహాలక్ష్మి, షబానా, వైష్ణవి, ఇషిత, తామ్య స్ఫూర్తి, విజయలక్ష్మి, పల్లవి, భార్గవి, అర్పిత, మ హేశ్వరి, మోక్షిత, కీర్తి, హర్షవర్ధిని, విజయ, మౌనిక, పల్లవి ఎంపిక య్యారు.

గన్‌మెన్‌లు లేకుండా పర్యటించలేమా?

- ఆక్రమించి ఇళ్లు కట్టిన వారిపై చర్యలు తప్పవు
- అధికారులు, టీడీపీ శ్రేణుల సమావేశంలో కిశోర్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేకిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూలై 4: గన్‌మెన్‌ల రక్షణ లేకుండా నియోజకవర్గంలో పర్యటించలేమా? అని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గన్‌మెన్‌లను చుట్టూ పెట్టుకుని రాజకీయాలు చేసే దుస్థితి మాత్రం రానివ్వమని ఆయన తేల్చి చెప్పారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో అధికారులు, టీడీపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో కిశోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి గన్‌మెన్‌లను కేటాయిస్తేగానీ తాము నియోజకవర్గంలో తిరగలేమని హైకోర్టును ఆశ్రయించిన ఉదంతాన్ని ప్రస్తావించారు. అప్రజాస్వామికంగా, అణచివేతలే లక్ష్యంగా, రాజకీయం చేస్తే చివరికి ఇలానే వుంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ భూముల్లోకి, స్థలాల్లోకి అక్రమంగా జొరబడి ఆక్రమించి ఇళ్లు కట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఇలాంటి సందర్భాల్లో విద్యుత్ సర్వీసులను ఎలా మంజూరు చేస్తారని విద్యుత్ శాఖ ఏఈని నిలదీయగా పంచాయతీ సిఫారసు మేరకే సర్వీసులు విడుదల చేశామని ఆయన సమాధానమిచ్చారు. జలజీవన్ మిషన్ పనుల్లో అనేక అక్రమాలు జరిగాయని, ప్రధానంగా మోటార్ల లెక్కలు తేల్చాల్సి వుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లకు చెప్పారు. ప్రశాంతంగా ఉన్న కలికిరిలో క్రికెట్ బెట్టింగులతో యువతను నాశనం చేస్తున్నారని, ఈ బుకీలపై వున్న పాత కేసులను కూడా వెలికి తీసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో గురువారం అల్లూరి సీతారా మరాజు జయంతి ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించడంతో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి కిశోర్‌కుమార్ రెడ్డి నివాళులర్పించారు.

ఎంపీపీ, జడ్పీటీసీ డుమ్మా!

వైసీపీకి చెందిన మండల పరిషత్ ఎంపీపీ నూర్జహాన్, జడ్పీటీసీ పద్మజ గురువారం నాటి ఎమ్మెల్యే సమీక్షా సమావేశానికి హాజరు కాలేదు. ఈ సమావేశంలో కలికిరి మాజీ జడ్పీటీసీలు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, రహంతుల్లా, మాలతి, మాజీ సర్పంచులు లక్ష్మీకర్ రెడ్డి, అంజమ్మ, రెడ్డివారి యోగేష్ రెడ్డి, నిజాముద్దీన్, చంద్రశేఖర్, సహదేవ రెడ్డి, సతీష్ రెడ్డి, తహసీల్దారు విజయకుమారి, ఎంపీడీవో రామకృష్ణయ్య, ఇతర మండల శాఖల అధికార్లు పాల్గొన్నారు.

సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కలికిరి, జూలై 4: గత సమ్మె కాలంలో తమకు మద్దతు తెలుపుతూ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నాయకులు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. గురువారం నగరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి ఆ మేరకు వారొక వినతి పత్రం అందజేశారు. సంఘానికి సంబంధించి ఏఐటీయూసీ అనుబంధ విభాగం జిల్లా కన్వీనరు నాగేశ్వరి ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యేకి తమ సమస్యలు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజులు సమ్మె చేశామని అప్పట్లో టీడీపీ తమ సమ్మెకు అండగా నిలిచిందని చెప్పారు. కూటమి అధికారం చేపడితే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరి, సుహాసిని, ప్రేమ, రూపా రాణి, అన్నపూర్ణ, నాగార్జున, భూదేవి, తులసి, రమాదేవి, సీత, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, మురళి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల సంఖ్య పెంచండి



అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీవో

రామసముద్రం, జూలై 4: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల సంఖ్య పెంచాలని సీడీపీవో సుజాత అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రతి ఒక్క అంగన్‌వాడీ కేంద్రం పనిచేలన్నారు. ఆయాలు, కార్యకర్తలు తప్పనిసరిగా యూనిఫాంలో ఉండాలని, మెనూ ప్రకారం పిల్లలకి భోజనం పెట్టాలని ఆమె తెలిపారు. కేంద్రంలోను, పరిసరాల్లోను పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. పిల్లల సంఖ్య ఎక్కడైనా తగ్గితే తల్లుల సమా వేశం ఏర్పాటు చేసి పిల్లలు కేంద్రానికి వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, చంద్రకాంత, కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో ఓ థియేటర్‌లో ఆర్డీవో తనిఖీలు

పీలేరు, జూలై 4: పీలేరులోని ఓ సినిమా థియేటర్‌ను గురువారం రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు థియేటర్‌లో అన్ని వసతులు, పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన పరిశీలించారు. తన తనిఖీ సారాంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు తహసీల్దారు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మదనపల్లెలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



విద్యార్థులను బయటకు పంపి బంద్ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 4: విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలను బంద్ ప్రశాంతంగా జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్, ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యాసంస్థల వద్దకు వెళ్లి తరగతుల్లోని విద్యార్థులను బయటకు పంపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకులో భాగమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాగా పట్టణంలో తిరుగుతున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినయ్, కమలాకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, ఉదయ్ పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణపై దృష్టి సారించండి



డయేరియాపై అవగాహనా ప్రదర్శనలో పాల్గొన్న డీఐఓ ఉషశ్రీ

కలికిరి, జూలై 4: ఎక్కడా డయేరియా వ్యాధి ప్రబలకుండా నియంత్రించడంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి (డీఐఓ) డాక్టర్ ఉషశ్రీ సూచించారు. గురువారం ఆమె గుండ్లూరు పంచాయతీలో నిర్వహించిన 104 వైద్య సేవల శిబిరాన్ని సందర్శించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని సిద్ధం చేసి అన్ని చోట్లా అందుబాటులో ఉంచాలని చెప్పారు. జింక్ మాత్రల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఓఆర్ఎస్ కేంద్రాలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అనంతరం డయేరియా నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లను డాక్టర్ ఉషశ్రీ ప్రదర్శించారు. కార్యక్రమంలో మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప, పర్యవేక్షకులు నాగిరెడ్డి, హేమలత, హెచ్‌ఈ రఫీ, ఎమ్ఎల్‌హెచ్‌పి నాగవేణి, ఏఎన్ఎం ప్రభావతి, హెల్త్ ఎడ్యుకేటర్ రఫీ, ఆశాలు రెడ్డికుమారి, వెంకటలక్ష్మి, దివ్య పాల్గొన్నారు.

కలికిరిలో పూర్తయిన పింఛన్ల పంపిణీ

కలికిరి, జూలై 4: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ బుధవారం నాటికి పూర్తయినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. మొత్తం మండలానికి వివిధ కేటగిరీలకు చెందిన 7128 పింఛన్లకుగానూ 7062 మందికి పంపిణీ చేశామని చెప్పారు. మొత్తంలో 66 మంది అందుబాటులో లేనందున పంపిణీ చేయలేకపోయినట్లు వివరించారు. నిలిచిపోయిన పింఛన్లలో 47 మంది మరణించారని, 9 మంది ఆసుపత్రుల్లో చికిత్సలో ఉన్నారని, పది మంది ఇతర ప్రదేశాల్లో ఉన్నారని ఎంపీడీవో విశదీకరించారు.

వారపు సంత స్థలం సమస్య పరిష్కారానికి చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంసీడీవో పోలప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూలై 4: ములకలచెరువు పీటీఎం రోడ్డుపై జరుగుతున్న వారపు సంత స్థలం పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగేళ్లుగా రోడ్డుకు ఇరువైపులా వారపు సంత జరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గురువారం ఎంపీడీవో పోలప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీంలు అనువుగా ఉన్న ఆర్టీసీతో పాటు పలు స్థలాలను పరిశీలించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి స్థలాన్ని నిర్ణయించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. టీడీపీ నేతలు చెన్నకిష్టా, కేశవులు ఉన్నారు.